Postal Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 64 పేజీలు 8 వెల : 5 ఆదివారం 24 ఆగష్టు 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా !.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| బ్యాక్ కవర్ పేజి మల్టీకలర్ : 50,000/- | బ్లాక్ & వైట్ పేజి |
| ఇన్నర్ మల్టీకలర్ పేజి : 20,000/- | బ్యాక్ పేజి : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజి : 70,000/- | ఇన్నర్ పేజి : 20,000/- |
| | ఫ్రంట్ పేజి : 30,000/- |


గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

## కృష్ణా, గోదావరి నదుల్లో తగ్గుతున్న వరద ఉద్ధృతి



రాజమహేంద్రవరం: గోదావరిలో వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. దీంతో ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 13.3 అడుగులకు చేరింది. డెల్టా కాల్వలకు 12,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి సుమారు 12.13 లక్షల క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.



రాష్ట్రం అభివృద్ధికి వారే అడ్డుతగులుతున్నారు

ప్రతిపక్ష పాత్ర దక్కకపోవడంతో విషం చిమ్ముతున్నారు

స్వర్ణాంధ్ర సాధనలో ప్రజలు భాగస్వాములు కావాలి

పెద్దాపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సిఎం చంద్రబాబు

# వైకాపా కుట్ర రాజకీయాలు!

కాకినాడ: వదల బొమ్మాళీ అంటున్న వైకాపా భూతాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని సిఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రం బాగు కోసం కూడా పది తరాల ముందు ఆలోచించాలన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష స్థానం దక్కకపోవడంతో, అందుకే బయట విషం చిమ్ముతున్నారు. కారు కింద సొంత కార్యకర్త పడినా పట్టించుకోరు. నెల్లూరు వెళ్లి మార్ఫింగ్ ఫొటోలతో ప్రచారం చేశారు. అమరావతి మునిగిపోయిందని వైకాపా దుష్ప్రచారం చేస్తోంది. అమరావతికి నిధులు ఇవ్వొద్దని అందరికీ లేఖలు రాశారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా అమరావతిని తయారు చేస్తాం. అమరావతి, విశాఖ, తిరుపతిని మహానగరాలుగా మారుస్తాం అన్నారు పెట్టుబడులు పెట్టేందుకు వస్తే ఎవరైనా ఆహ్వానిస్తారు. వైకాపా నేతలు మాత్రం పెట్టుబడిదారులను బెదిరిస్తారు. వైకాపా హయాంలో నకిలీ వ్యక్తులకు దివ్యాంగుల పింఛన్లు ఇచ్చారు. పింఛన్లు అర్హులకే అందాలి.. అనర్హులకు కాదు. రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతీసేలా విషప్రచారం చేస్తున్నారు. మనది విజన్ రాజకీయం.. వాళ్లది క్రిమినల్ రాజకీయం అని చంద్రబాబు వైకాపా తీరుపై మండిపడ్డా. స్వర్ణాంధ్ర కావాలంటే ప్రజల ఆలోచనా విధానం మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజల సహకారం, భాగాస్వామ్యంతోనే దీనిని సాధించగలమని అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సభలో సీఎం పాల్గొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. దీనిని విస్మరించడం వల్లనే అంటు- వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఇందుకు ప్రధాన కారణం చెత్త, అపరిశుభ్రత అన్నారు. గత వైకాపా ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది గానీ.. చెత్త మాత్రం తీయలేదు. ప్రజారోగ్యాన్ని వైకాపా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అక్టోబరు 2 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం తొలగిస్తాం. గత ప్రభుత్వంలో అరాచకాన్ని సృష్టించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కార్యక్రమాలు చేస్తున్నాం. ప్రతి ఒక్కరి ఆదాయం పెరిగి.. ఆరోగ్యంగా ఉండాలనేదే నా ఏకైక కోరిక. మన ఆలోచనలు ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలి. ఈ ప్రపంచంలో ఏదీ వృథా కాదు.. చెత్త నుంచి సంపద సృష్టించొచ్చు. ఈ-వేస్ట్‌ను రీసైక్లింగ్‌కు పంపేలా ఆలోచనలు చేస్తున్నాం. పేదవాడి ఆరోగ్యం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పెద్దాపురంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తాం అని చంద్రబాబు హామీ ఇచ్చారు. సంపద సృష్టించడం.. ఆదాయాన్ని పెంచడం మాకు తెలుసు. అప్పులతో సంక్షేమ కార్యక్రమాలు చేస్తే దీర్ఘకాలం కొనసాగదు. నేను సూపర్ సిక్స్ అంటే సాధ్యం కాదన్నారు.



2లో..

## విశాఖలో ఆహా ఏమి రుచులు

దాడుల్లో పాచిపోయిన ఫుడ్ పట్టివేత

గత నాలుగైదు రోజుల క్రితం వండిన చికెన్, మటన్, ఫిష్, రొయ్యలు లాంటి వంటకాలను తిరిగి వేడి చేసి ప్లేట్లలో పెట్టడం రోజువారీ పద్ధతిగా మారిపోయింది.



2లో..

## ఆదాయం తగ్గి.. అప్పులు పెరిగాయి

ఆందోళన కలిగిస్తున్న కాగ్ నివేదికలు

ఎక్స్ వేదికగా ఆర్థిక పరిస్థితిపై జగన్ విమర్శలు



2లో..

సిట్ వెల్లడించినట్లు వస్తున్న

## వార్తలు అవాస్తవం

సిట్ ప్రశ్నలకు నేరుగా సమాధానం చెప్పా

అరెస్ట్ చేశారంటూ అసత్య ప్రచారం చేశారు

మాజీమంత్రి నారాయణ స్వామి సంచలన వ్యాఖ్యలు

## రౌడీషీటర్ శ్రీకాంత్ వ్యవహారం.. భవిష్యత్తులో ఎవరికీ పెరోల్ సిఫారసు చేయను: కోటంరెడ్డి



నెల్లూరు: రౌడీషీటర్ శ్రీకాంత్ పెరోల్ విషయంలో వైకాపా దుష్ప్రచారం చేస్తోందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాంత్‌కు పెరోల్ ఇవ్వాలని ఆయన తండ్రి, సోదరుడు వస్తే సిఫారసు లేఖ ఇచ్చానన్నారు. వివిధ సమస్యల్లో వచ్చేవారికి ఎమ్మెల్యేలు లేఖలు ఇస్తారని పేర్కొన్నారు. అధికారులు వాటిని పరిశీలించి సమాధానం చెబుతారన్నారు. తానిచ్చిన లేఖను తిరస్కరిస్తూ జులై 16న అధికారులు సమాధానం పంపారని వివరించారు. జులై 30న అధికారులు పెరోల్ మంజూరు చేశారన్నారు. తమ లేఖను తిరిస్కరించి 14 రోజుల తర్వాత పెరోల్ మంజూరు చేశారని చెప్పారు. "పెరోల్ అంశంపై విచారణ చేయిస్తున్నామని హోంమంత్రి చెప్పారు. నా సిఫారసు లేఖను తిరస్కరించిన 14 రోజుల్లోనే అధికారులు ఎలా పెరోల్ ఇచ్చారో? వైకాపా హయాంలో ఇదే శ్రీకాంత్‌కు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య లేఖలు ఇచ్చారు. వాటిని ఆధారం చేసుకుని పెరోల్ కూడా ఇచ్చారు. సిఫారసు లేఖలు ఇవ్వడమే తప్పుగా చిత్రీకరిస్తున్న వైకాపా.. అప్పుడు శ్రీకాంత్‌ను ఎలా బయటకు తెచ్చింది? ఎమ్మెల్యేలు ఇచ్చిన లేఖలను నేను తప్పుపట్టను. లేఖలు సాధారణం, అధికారులు నిర్ణయం తీసుకుంటారు. రాజకీయ జీవితంలో ప్రతిదీ గుణపాఠమే. ఇకపై భవిష్యత్తులో ఎవరికీ పెరోల్ సిఫారసు చేయను." అని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు.

## తుదిశ్వాస వరకు పేదలపక్షానే పోరాటం



సురవరంతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ప్రముఖులు

ఆయన కుటుంబ సభ్యులకు పరామర్శ

ఆసుపత్రికి తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు

రాయదుర్గం: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను శనివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఖాజాగూడలోని ఆయన నివాసంలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు భాగం హేమంతరావు, కార్యవర్గ సభ్యులు సాబిర్ బాషా, శ్రీనివాసులునాయుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు సుధాకర్‌రెడ్డి సతీమణి డా.బీవీ విజయలక్ష్మి, కుమారులు నిఖిల్, కపిల్‌లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పేదల కోసం తుదిశ్వాస వరకు పోరాడారని కొనియాడారు. భౌతికకాయం ఆసుపత్రి వద్దే ఉందన్న సమాచారంతో పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. సురవరం మృతిపట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ సంతాపం ప్రకటించారు.

# ఓట్ చోరీపై రాష్ట్రంలోనూ నిరసనలు

హైదరాబాద్: ఓట్ల చోరీ వ్యవహారంపై ఏఐసీసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. ఈ క్రమంలోనే ఓట్ల చోరీకి సంబంధించిన ప్రచార లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, పీఏసీ సభ్యులతో కలిసి లోగోను విడుదల చేశారు. ఓట్ల చోరీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల భాజపాపై విమర్శలు ఎక్కుపెట్టిన విషయం తెలిసిందే. ఓట్ల చోరీని అడ్డుకుందామని.. రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతిద్దామని పిలుపునిచ్చారు. రాహులం చేస్తున్న ఆందోళనకు మద్దతుగా రాష్ట్రంలోనూ ఆందోళనలునిర్వహించాలని నిర్ణయించారు. ఇకపోతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించిన నేతలు.. పార్టీపరంగా బీసీలకు 42 శాతం టికెట్లు-ఇవ్వాలని నిర్ణయించారు. శనివారం సాయంత్రం గాంధీభవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ- సమావేశంలో పలు అంశాలపై నేతలు చర్చించారు. రాష్ట్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న కమిటీల నిర్మాణంపై చర్చించారు. ఏఐసీసీ పిలుపు



మేరకు ఓట్ చోరీ, గద్దీ ఛోడ్ ఉద్యమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. యూరియా కొరతపై భారత రాష్ట్ర సమితి, భాజపా చేస్తున్న రాజకీయాలు కూడా నేతల మధ్య చర్చకు వచ్చినట్టు- సమాచారం. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ
స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా కేసీఆర్ చట్టం తెచ్చారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ అడ్డంకిని తొలగించడానికి ఆర్డినెన్స్ తెచ్చామని పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరించడానికి ఆర్డినెన్సు తెచ్చామని.. దాన్ని గవర్నర్ కేంద్రానికి పంపారని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లో బీసీలకు మేలు జరగాల్సిందేనని సీఎం అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట నిలబడాలన్న సీఎం రేవంత్.. కేసీఆర్ తెచ్చిన చట్టం ప్రకారం బీసీలకు ఒక్క శాతం రిజర్వేషన్ కూడా రాదన్నారు. 90 రోజులలో రాష్ట్రపతి బిల్లులను ఆమోదించాలన్న అంశంపైన సుప్రీం కోర్టులో మన రాష్ట్ర వాదనలు వినిపించడం కోసం ఇద్దరు న్యాయవాదులను నియమించామని సీఎం చెప్పారు. అందులోనే రాష్ట్రపతి దగ్గర ఉన్న మన బీసీ బిల్లు అంశం ప్రస్తావనకు వస్తుందని చెప్పారు. విడిగా సుప్రీం
కోర్టుకు వెళ్తే కేసు లిస్ట్ కావడానికి చాల సమయం పడుతుందని స్పష్టం చేశారు.
బీఆర్ఎస్, బీజేపీ కలిసి యూరియా కొరత పైన డ్రామాలు ఆడుతున్నాయని సీఎం విమర్శించారు. యూరియా ఇచ్చే పార్టీకే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇస్తానని కేటిఆర్ అనడంలోనే వాళ్ల తీరు అర్థం అవుతుందని సీఎం ఎద్దేవా చేశారు. యూరియా కోసం నాలుగు సార్లు కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అనుప్రియా పటేల్ ను కలిశానని.. యూరియా పంపిణీ పైన క్షేత్రస్థాయిలో మానిటరింగ్ ను పెంచాలని సీఎం అన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నేతలు వీహెచ్, జానారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఓట్ చోర్ ఆందోళన మూర్ఖత్వం

హైదరాబాద్: బిహార్ ఎన్నికల్లో మంచి వాతావరణం ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, ఆర్జేడీకి ఒక ఎజెండా అంటూ ఏమీ లేదని విమర్శించారు. రాహుల్‌గాంధీ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. ఆయన ఎందుకు ఆందోళన చేస్తున్నారో తెలియరకాంగ్రెస్ వారే గదరగోళానికి గురవుతున్నారని అన్నారు. ఓట్ చోరీ అయితే తెలంగాణ, కర్నాటకల్లో ఎలా విజయం సాధించారని అన్నారు. బిహార్‌లో ఇల్లీగల్ ఓట్లు- ఎక్కువ ఉన్నాయి. హైదరాబాద్‌లో డబుల్ ఓట్లు ఉన్నాయి.. ఇది దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది.. దొంగ ఓట్లతోనా? తీవ్రమైన నేరాల్లో ఉన్న సీఎం, మంత్రులు, కేంద్ర మంత్రులు రాజీనామా చేయాల్సిందే. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరగాల్సిందే. గతంలో దీనిపై కాంగ్రెస్ లేఖ రాసింది.. ఇప్పుడు మౌనంగా ఉందని కిషన్‌రెడ్డి తెలిపారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాడుతున్న భాష పట్ల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తనను సైంధవుడు అని అన్నారని ఆయన తెలిపారు. కళ్ళు పీకి
గోలీలు ఆడుకుంటానని, తొండలు పెడతామని, పేగులు తీసి మెడలో వేసుకుంటానని, హవులగా.. ఇలా రకరకాలుగా పరస్పర విమర్శలు చేయడం భావ్యం కాదన్నారు. తాను ఆర్ఎస్ఎస్ స్క్రిప్ట్ చదువుతున్నానని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించడాన్ని ఆయన ప్రస్తావిస్తూ తాను ఆర్ఎస్ఎస్ కాబట్టి చదువుతానని అన్నారు. ఇది తెలంగాణ భాష కాదన్నారు. రాజకీయాల్లో శత్రువులు ఉండరాదని, ప్రత్యర్థులు మాత్రమే ఉండాలని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## హైదరాబాద్ ఓ మంచి డెస్టినేషన్

ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్‌కి కెటిఆర్ ఆఫర్



హైదరాబాద్: ఓపెన్ ఏఐ తన కార్యకలాపాలను హైదరాబాద్‌లో ప్రారంభించాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా కోరారు. ఇటీవల ఆ కంపెనీ సీఈవో శామ్ అల్ట్‌మన్ భారత్‌లో కార్యాలయం ఏర్పాటు- చేస్తామని తెలిపారు. సెప్టెంబర్‌లో ఇక్కడ పర్యటిస్తామన్నారు. ఈక్రమంలో కేటీఆర్ ఆయనకు స్వాగతం పలికారు. భారత్‌కు హైదరాబాద్‌ను గేట్‌వేగా అభివర్ణించారు. ఓపెన్ ఏఐ లాంటి సంస్థలకు ఆదర్శవంతమైన కేంద్రమని పేర్కొన్నారు. తన కార్యకలాపాలు ప్రారంభించడానికి హైదరాబాద్‌లో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నుంచి భారతదేశ కార్యకలాపాలను ప్రారంభించాలని ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్‌కి ఆయన విజ్ఞప్తి చేశారు. భారత దేశంలో త్వరలో కార్యాలయం ఏర్పాటు చేస్తామని చెప్పిన క్షూ।ఆఐ ఈఊక్ష సామ్ ఆల్ట్‌మన్‌కి హైదరాబాద్ నుంచి కంపెనీ కార్యకలాపాలు ఏర్పాటు-చేయాలని ఎక్స్ వేదికగా కేటీఆర్ కోరారు. వచ్చేనెల భారత్‌లో పర్యటిస్తున్నానని తెలిపిన సామ్ ఆల్ట్‌మన్‌కి హైదరాబాద్ నగరానికి కేటీఆర్ స్వాగతం పలికారు. హైదరాబాద్‌ను భారతదేశానికి సరైన ప్రవేశ ద్వారంగా,అలాంటి సంస్థలకు ఆదర్శవంతమైన కేంద్రంగా అభివర్ణించారు. ఈ నగరం భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను కలిగి ఉందని, తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ వంటివి ఉన్నాయని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా, ఆపిల్, క్వాల్‌కామ్ లాంటి అనేక గ్లోబల్ టెక్ దిగ్గజాలకు కేంద్రంగా మారిందని, ఇక్కడ సాంకేతిక, స్టార్టప్ రంగాలలో అపారమైన ప్రతిభ ఉందని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంగా తెలంగాణ ప్రభుత్వం, భారతదేశానికి ఆఐ రాజధానిగా రాష్ట్రం మారడానికి అనేక సాహసోపేతమైన చర్యలు తీసుకుందని వివరించారు.

# యూరియా కొరతపై కేంద్ర,రాష్ట్రాల హైడ్రామా



హైదరాబాద్:రైతు ప్రయోజనాలు పక్కన బెట్టి, ఎరువుల కొరత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రామాకు తెరతీసాయని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. యూరియా కొరత తీర్చడంపై దృష్టి పెట్టడం మానేసి, తమ తప్పు లేదన్నట్లు- చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. 'దేశంలో యూరియా కొరత లేదని ఒకవైపు కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం కేంద్రం ఇవ్వడం లేదంటున్నారు. వీరద్దరిలో ఎవరు నిజం? ఎవరు అబద్ధం? ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమా? లేక రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వమా' అని హరీశ్ రావు నిలదీసారు. దేశవ్యాప్తంగా 143 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే, అందుబాటు లో 183 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయని, ఇప్పటికే 155 లక్షల మెట్రిక్ టన్నులు విక్రయించామని కేంద్రం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసారు. ఇదే విధంగా, ఉఅ 45 లక్షల టన్నుల అవసరానికి 49 లక్షల టన్నులు అందుబాటు-లో ఉన్నాయని, కఔ 58 లక్షల టన్నుల అవసరానికి 97 లక్షల టన్నులు అందుబాటు-లో ఉన్నాయని కేంద్రం తెలిపిందని తెలిపినట్లు- గుర్తు చేసారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాలు
నిజమైతే, రైతులకు ఎరువులు అందించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వమే తప్పిదానికి బాధ్యత వహించాలన్నారు. దేశం మొత్తంలో ఎరువుల కొరత లేకపోయినా, తెలంగాణలో మాత్రం రైతులు ఇబ్బందులు పడుతుండటం రేవంత్ సర్కారు నిర్లక్ష్యాన్ని చూపుతుందని విమర్శించారు. రైతులను మోసం చేయడం మానేసి, తక్షణమే అవసరమైన ఎరువులు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.



## విశాఖలో ఆహా ఏమి రుచులు

విశాఖపట్నం: విశాఖపట్నంలో రెస్టారెంట్లు, హోటళ్ల తీరు ఇప్పటికీ మారడం లేదు. అదే పాచిపోయిన ఆహారం, అదే నిల్వ ఉంచిన నాన్ వెజ్ వంటకాలను మళ్లీ మళ్లీ వేడి చేసి కస్టమర్లకు సరఫర చేస్తున్నారు. ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న ఈ రెస్టారెంట్లపై అధికారులు కొద్ది రోజుల క్రితం కొరడా ఝులిపించినా, వారి పద్ధతిలో ఎలాంటి మార్పు రాలేదు. గత నాలుగైదు రోజుల క్రితం వండిన చికెన్, మటన్, ఫిష్, రొయ్యలు లాంటి వంటకాలను తిరిగి వేడి చేసి ప్లేట్లలో పెట్టడం రోజువారీ పద్ధతిగా మారిపోయింది. తాజాగా విశాఖలోని ఎంవీపీలో ఉన్న 'ఆహా ఏమి రుచులు' రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో 85 కిలోల పాచిపోయిన ఫుడ్ దొరికింది. పాచిపోయిన ఫుడ్ ను అధికారులు స్వాధీనం చేసుకుని శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. కిచెన్ తనిఖీ చేసి పాచిన ఆహారపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. రిపోర్టు వచ్చిన తర్వాత రెస్టారెంట్‌పై తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అయితే, తమ కష్టార్జిత డబ్బును ఖర్చు పెట్టి తింటున్నా, నాణ్యమైన ఆహారం లభించడటం లేదని కస్టమర్లు రెస్టారెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాచిపోయిన ఆహారం ఇస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెస్టారెంట్ల నిర్లక్ష్యంతో ప్రజల ఆరోగ్యాలు ప్రమాదంలో పడకుండా.. అధికారులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

## క్యూలైన్లలో పడుతున్న తిప్పలు



హైదరాబాద్:దుక్కి దున్నినప్పటి నుంచి పంట ఇంటికొచ్చేంత వరకు రైతన్నల పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. ప్రకృతి సహకరిస్తే ప్రభుత్వం సహకరించకపోవడం పట్ల అన్నదాతలు అనేక అవస్థలు పడుతున్నారు. రైతులు పంటను కాపాడుకునేందుకు అవసరమయ్యే ఎరువులకోసం పడిగాపులు కాస్తున్నారు. పలు జిల్లాల్లో రైతులు నానా యాతన పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవడంతో అనుక్షణం ఎరువుల రాక కోసం పడిగాపులు కాస్తున్నారు. ముఖ్యంగా యూరియా ఎరువుల కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పంపిణీ కేంద్రాల వద్ద నిద్రాహారాలు మాని క్యూలైన్లో రోజంతా నిలబడుతున్నారు. అయినా యూరియా దొరుకుతుందన్న నమ్మకం రైతులకు కలగడం లేదు. మహిళా రైతుల సైతం పనులన్నీ మానుకొని యూరియా కోసం గంటల తరబడి వేచి చూడడం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే చూస్తున్నామని వాపోతున్నారు. ఇకపోతే యూరియాపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం రైతుల ప్రాణాల మీదకు తెస్తున్నది. రాత్రనక, పొద్దనక యూరియా సోకం ఆగ్రో సెంటర్ల వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న అన్నదాతలు అనారోగ్యానికి గురవుతున్నారు. శనివారం ఉదయం మహబూబ్‌నగర్ పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం వద్దకు యూరియా కోసం పెద్ద సంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఈ క్రమంలో ఓ రైతుకు ఫిట్స్ రావడంతో పడిపోయారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.

## ఆదాయం తగ్గి..అప్పులు పెరిగాయి

అమరావతి:ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై సోషల్ మీడియా వేదికగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఎక్స్ లో స్పందించిన ఆయన.. ఆదాయాలు తగ్గిపోయి, అప్పులు పెరగటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. కాగ్ నివేదికలపై ఎక్స్ లో ట్వీట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాలు భారీగా తగ్గి, అప్పులు పెరిగి పోతున్నాయి.. కూటమి ప్రభుత్వ విధానాలతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.. ఆదాయాలు తగ్గి, అప్పులు పెరిగిపోతున్న ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పునరాలోచన చేయాలని హితవు చెప్పారు.. అన్ని స్థాయిల్లో పెరిగిన అవినీతిని అరికట్టాలని సూచించారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2019-24 మధ్య మా ప్రభుత్వంపై టీ-డీపీ, జనసేన పార్టీలు పదేపదే అబద్ధాలు చెప్పాయి. రాష్ట్రంలో ఆదాయ వృద్ధి తగ్గిందనీ, అభివృద్ధి అనేదే లేదని తప్పుడు ప్రచారం చేశాయి. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామంటూ కూటమి నేతలు నమ్మబలికారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ఆదాయాలు భారీగా తగ్గాయని పేర్కొన్నారు జగన్.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయాలు కేవలం 3.08 శాతం మాత్రమే పెరిగాయని తెలిపారు జగన్.. కేంద్ర ప్రభుత్వ ఆదాయాల వృద్ధి 12.04 శాతం పెరగగా, ఏపీ ఆదాయం భారీగా తగ్గిపోయిందన్న ఆయన. కూటమి ప్రభుత్వం చెప్పినట్టు- నిజంగానే ఏపీ ఆర్థిక వృద్ధి 12.02 శాతం ఉంటే, మరి ఆదాయం పెరుగుదల 3.08 శాతం దగ్గరే ఎందుకు ఆగిపోయింది? అని ప్రశ్నించారు.. గతేడాదితో పోల్చితే ఈఏడాది కొంత ఆశాజనకంగా ఉంటుందనుకుంటే మొదటి నాలుగు నెలల్లో కూడా అదే పరిస్థితి నెలకొంన్న ఆయన.. ప్రజల్లో కొనుగోలు శక్తి కూడా బాగా తగ్గిపోయిందన్నారు.. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆదాయాల వృద్ధి పది శాతం ఉండాల్సి ఉండగా, కేవలం 2.39 శాతం మాత్రమే ఉంది. మా హయాంలో అన్ని రకాల అప్పులు కలిపి రూ.3,32,671 కోట్లు- మాత్రమే.. కానీ, టీ-డీపీ కూటమి ప్రభుత్వం ఈ 14 నెలల్లోనే ఏకంగా రూ. 1,86,361 కోట్లు- అప్పు చేసింది.. అంటే మా ఐదేళ్ల హయాంలో చేసిన అప్పుల్లో ఇప్పటికే 56 శాతం చేశారని పేర్కొన్నారు..

# మా లెక్కలు ఏం తేల్చేది

అమరావతి: వై నాట్ 175 అంటే వైసీపీ బట్టలు ఊడదీశారు.. జగన్ బట్టలు నైతికంగా ఊడతీశారని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యాఖ్యానించారు.. అమరాతిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. వైసీపీ నేతలు ఎవర్ని బెదిరిస్తున్నారు..? అని ప్రశ్నించారు.. ఇక, మా గొప్పతనం వల్ల మేం గెలవలేదు... వైసీపీ అరాచకాలు వల్ల గెలిచామని చెప్పుకొచ్చారు.. మా లెక్కలు తేలుస్తారా..? ఏ లెక్కలు ఉన్నాయని తేలుస్తారు? అంటూ మండిపడ్డారు.. వైసీపీకి ప్రజలు రాజకీయ గోరి కట్టే రోజు దగ్గరలోనే ఉందన్న ఆయన.. దోపిడీదారులకు తమ అండ దండ ఉందని జగన్ నేతృత్వంలో వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు.. జగన్ కు, అతని అనుచరులకు కాల్చి ఎక్కడ వాతలు పెట్టకూడదో అక్కడ ప్రజలు వాతలు పెట్టినా బుద్ధిరాలేదని ఫైర్ అయ్యారు.. తాను చేసిన దోపిడీకి భార్యను కేసులో ఇరికించి పారిపోయిన పేర్ని నాని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ లపై నోరూపారేసుకుంటు-న్నాడు.. దోచుకోవడం, దోపిడీ చేయటమే వైసీపీ సిద్ధాంతమని దుయ్యబట్టారు చింతమనేని.. అధికారం ముసుగులో చేసిన అరాచక దాడులు మరిచారా? అని ప్రశ్నించిన ఆయన.. చేపల దొంగతానినికి పాల్పడ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరికి మద్దతుగా జగన్ అనుచరవర్గమంతా వచ్చింది.. కొల్లేరుకు వలస పక్షులు వచ్చినట్లు- అప్పుడప్పుడు దెందులూరుకు అబ్బయ్య చౌదరి వస్తాడు.. ఎప్పుడు ఎప్పుడు టీ-డీపీలో చేరాలా అని అబ్బయ్య చౌదరి ప్రయత్నిస్తున్నాడు.. ఎన్నికల సమయంలో కూడా నేను గెలిచి టీ-డీపీలో చేరతానని ప్రచారం చేసుకున్నాడని మండిపడ్డారు.. ఇక, దెందులూరు నియోజకవర్గంలో చేసిన అక్రమాలపై త్వరలో చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## సిట్ వెల్లడించినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం

చిత్తూరు:ఏపీలో సంచలనంగా మారిన లిక్కర్ స్కాం కేసులో శుక్రవారం రోజు వైసీపీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ- సీఎం నారాయణస్వామిని సిట్ అధికారులు ప్రశ్నించారు.. దాదాపు 6 గంటల పాటు నారాయణస్వామిని విచారించిన సిట్ అధికారులు కీలక విషయాలు రాబట్టారని.. ఆయన కీలక సమాచారం ఇచ్చారని, ల్యాప్‌టాప్ కూడా సీజ్ చేశారని వార్తలు వచ్చాయి.. అయితే, సిట్ విచారణపై మరోసారి మీడియాతో మాట్లాడిన మాజీ డిప్యూటీ- సీఎం నారాయణస్వామి.. ఆసక్తికర విషయాలు వెల్లడించారు.. సిట్ వారు సహకరించారు.. వారు ఆడిగిన ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాను... కేసుతో నాకేం సంబంధం లేదు.. అంతా పైవాళ్లే చేశారని నేను ఎక్కడ సిట్ అధికారులకు చెప్పలేదని స్పష్టం చేశారు.. సిట్ అధికారులు ఇబ్బంది పడే ప్రశ్నలు అడిగినా.. నేను సమాధానం చెప్పాను... నన్ను అరెస్టు చేశారంటూ కొందరూ అసత్య ప్రచారం చేశారని మండిపడ్డారు. నేనెప్పుడూ నీతిగా, నిజాయితీ బతికాను... ఎప్పుడూ తప్పు చేయలేదు.. అవినీతి చేయలేదన్నారు నారాయణస్వామి.. ఇక, నాకు ల్యాప్‌టాప్ అంటే
ఏంటో.. దానిని ఎలా వాడాలో కూడా తెలియదు.. నాకు వాట్సాప్ వాడటం కూడా రాదన్నారు.. ల్యాప్ టాప్ సిట్ అధికారులు తీసుకుని పోలేదన్నారు.. ప్రభుత్వం తరపున మద్యం అమ్మకాలు చేస్తే అవినీతికి అవకాశం ఉండదు అని తెలిపారు.. ప్రైవేటు- గా అమ్మకాలు సాగిస్తేనే అవినీతి జరుగుతుందన్నారు.. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో పాల ప్యాకెట్ల కంటే మద్యం 24 గంటలకు దొరుకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు..

## మీకు సమస్య ఉంటే మా ఉత్పత్తులు కొనకండి

న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేయొద్దంటూ భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు సుంకాలు విధించడంపై భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఘాటుగా స్పందించారు. భారత్ నుంచి చమురు, రిఫైన్డ్ ఉత్పత్తులు కొనుగోలుపై ఏదైనా సమస్యలు ఉంటే ఇక్కడి ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని అన్నారు. వ్యాపార అజెండాతో సాగుతున్న అమెరికా యంత్రాంగానికి మద్దతిస్తున్న కొన్ని దేశాలు ఇతరులపై నిందలు వేసే ప్రయత్నాలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడిలా విదేశాంగ విధానాన్ని ఇంత బహిరంగంగా నిర్వహించిన ఏ అధ్యక్షుడిని గతంలో చూడలేదన్నారు. వాణిజ్య అంశాలతో పాటు- వాణిజ్యేతర వ్యవహారాలకు టారిఫ్‌లు వినియోగిస్తుండటం కొత్తగా ఉందని ఉన్నారు. ఒక్క భారత్‌తోనే కాకుండా ప్రపంచంలోని చాలా దేశాలతో ఆయన డీల్ చేస్తున్న విధానం ఇలాగే ఉందన్నారు. వాణిజ్య సుంకాలను 50 శాతానికి పెంచుతున్నట్టు- ట్రంప్ ప్రకటించడానికి ముందు రష్యా చమురు అంశం గురించి అమెరికాతో తామెలాంటి చర్చలు జరపలేదని ఎనకానిక్ -టైమ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన వరల్డ్ లీడర్స్ ఫోరం సదస్సులో జైశంకర్ తెలిపారు. భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. భారత్‌తో ఘర్షణపూరిత వాతావరణాన్ని కొనసాగిస్తున్న వేళ.. పాకిస్థాన్-అమెరికా మధ్య స్నేహం ఇటీవల పెరుగుతున్నట్లు- కనిపిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రెండు దేశాల సంబంధాలపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ రెండు దేశాలకూ ఓ చరిత్ర ఉందని, గతాన్ని విస్మరించిన చరిత్ర కూడా వారిదేనన్నారు. ఈ సందర్భంగా ఒసామా బిన్ లాడెన్‌ను హతమార్చిన ఘటనను ఉటంకిస్తూ.. అమెరికా సైన్యం అబోటాబాద్‌లో జరిపిన ఆపరేషన్‌ను గుర్తుచేశారు. ఆ రెండు దేశాలకు పరస్పర చరిత్ర ఉంది. అంతేకాదు.. గతాన్ని విస్మరించిన చరిత్ర కూడా వారిదే. ఇటువంటివి మనం చూడటం కొత్తమీ కాదు. ఇదే అమెరికా సైన్యం అబోటాబాద్ వెళ్లి ఎవర్ని గుర్తించిందో మనందరికీ తెలుసు' అని జైశంకర్ పేర్కొన్నారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై సెప్టెంబర్ 11నాటి దాడికి సూత్రధారి బిన్ లాడెన్‌ను అమెరికా మట్టుపెట్టిన విషయాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. పలు దేశాల సైన్యాలు ఏవిధంగా పని చేస్తున్నాయనే విషయంపై జై శంకర్ మాట్లాడుతూ.. కొన్ని దేశాలు అవకాశవాద రాజకీయాలపై దృష్టి పెట్టినప్పుడు.. అవి అలా చేస్తూనే ఉంటాయి. అందులో కొన్ని వ్యూహాత్మకంగా లేదా ఇతర ప్రయోజనాల కోసం ఉండవచ్చని అన్నారు. ఇలాంటివి చూస్తున్నప్పుడు అమెరికాతో మనకు ఉన్న బలమైన సంబంధాలు ఏంటీ- ఏవి ముఖ్యమైనవనే అంశాలపైనా భారత్ దృష్టి సారిస్తుందన్నారు.మరోవైపు అమెరికా కోసమే తాము ఉగ్రవాదులను పెంచి పోషించామంటూ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల అంగీకరించిన విషయం తెలిసిందే. పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు- తాము చెత్త పనులన్నీ చేస్తున్నామని అన్నారు. దానివల్ల చాలా ఇబ్బందులు పడ్డామని, చివరకు అది పొరబాటు- అని అర్థమైందన్నారు. ఈ క్రమంలోనే పాక్ సైన్యాధికారి ఇటీ-వల రెండుసార్లు వాషింగ్టన్‌లో పర్యటించడం, తదనంతరం ట్రంప్ యంత్రాంగం పాక్‌పై సానుకూల ధోరణి అవలంబించడం ఆ రెండు దేశాల సాన్నిహిత్యాన్ని స్పష్టం చేస్తోంది.

ఉత్తేజిత దినపత్రిక



## మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు ప్రభుత్వ సెలవులు ఐడెంటి కార్డ్స్ జాయినింగ్ లెటర్ ఇవ్వాలని కమిషనర్ గారికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు వినతి

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిది




ఎమ్మిగనూరు ఆగస్టు 23 శనివారం మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ కార్మికులకు ప్రభుత్వ సెలవులు ఐడెంటి కార్డ్స్ జాయినింగ్ లెటర్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు జే నాగరాజు కే కాజా బి కేసన్న సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు పి గోవిందు బి రాముడు ఆధ్వర్యంలో కమిషనర్ గారికి డిమాండ్ల పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించలేదని అదేవిధంగా అత్యవసరంగా ప్రభుత్వ సెలవుల్లో డ్యూటీలు చేసిన వారికి స్థానిక పండుగలకు సెలవులు మంజూరు చేయాలని కోరారు అదేవిధంగా ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో అనారోగ్య కారణాలవల్ల 13 మంది కార్మికులు చనిపోవడం జరిగింది వీరు స్థానంలో మరణించిన కుటుంబ సభ్యులకు ఒకరికి ఉపాధి కల్పించాలని అధికారులను కోరారు కమిషనర్ స్పందించి కార్మికులకు సమస్యలను వారం లోపల పరిష్కరిస్తామని ఐడెంటి కార్డులు ఇస్తామని మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఒకరికి ఉపాధి కల్పించే విధంగా తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు కే ఇస్మాయిల్ కే సాల్మన్ బి రంగస్వామి తిక్కయ్య గోరు భాష పల్లవి రాజు సురేష్ వీరేష్ ఈరన్న సిఐటియు నాయకులు బి తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మినూరు పట్టణంలో ఐ ఎఫ్ టు యు కార్యాలయంలో రైతు కూలీ కార్మిక సమస్యలపై కే జయన్న ఆధ్వర్యంలో సమావేశం జరిగింది

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి




ఎమ్మిగనూరు ఆగస్టు 23 శనివారం సమావేశంలో బి ఏసేపు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ గత వారంలో కురిసిన వర్షాలకు పత్తి మొక్కజొన్న మిరప వరి పంటలో పూర్తిగా నాశనం అయ్యాయి దీనివలన రైతులు అనేక కష్టాల్లో గురవుతున్నారు పంటలకు ఎరువులు యూరియా రైతులకు అందుబాటు లేకుండా వ్యాపారస్తులు ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు దీనిపైన ప్రభుత్వ అధికారులు చర్య తీసుకోవాలని కోరుతున్నాం వర్షానికి నష్టపోయిన పంటలకు ప్రభుత్వ అధికారులు పరిశీలించి నష్టపోయిన రైతులకు ఎకరానికి 20000 రూపాయలు ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నాం ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నాం లేనిచో రైతు కూలీలు పోరాటాల్లో చేయాల్సి అవసరం ఉందని తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు సాంసంగ్ లాజర్ ఐ ఎఫ్ టుయు నాయకులు కే అనేఫ్ కిష్టప్ప చిన్న స్వామి రాముడు తదితరులు పాల్గొన్నారు

## పత్తికొండ పట్టణంలో కుంగిపోయిన రోడ్డు

పత్తికొండ నూర్: (ఉదయంన్యూస్)




రోడ్డు కుంగిపోయింది. పత్తికొండ పట్టణంలో ఆదోని రోడ్డు ఆదినారాయణ రెడ్డి కాలనీ ఎదురుగా ఒక్కసారిగా కుంగిపోయింది. అటుగా వెళ్తున్న మట్టి లోడ్ తో వెళ్తున్న టిప్పర్.. కుంగిన గుంతలో చిక్కుకుపోయింది. దీంతో డ్రైవర్‌తో, నానా అవస్థలు పడ్డాడు జెసిపి తో టిప్పర్ తొలగించే చర్యలు చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని.. ప్రమాదాన్ని ముందే గుర్తించి కొన్ని రోజులు ముందే పత్రికలలో

అధికారులను అప్రమత్తం చేసినా నిర్లక్ష్యం చూపారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## స్వతంత్ర సమరయోధులు భారత ఉప ప్రధాని దళితుల ఆశాజ్యోతి శ్రీ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి




పందికోన ఈరన్న తెలుగుదేశం పార్టీ దళిత నాయకులు ఎమ్మిగనూరు టౌన్

కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి

ఎమ్మిగనూరు ఆగస్టు 23 శనివారం దళిత బహుజనల ఆశాజ్యోతి అణాగారిన వర్గాల హక్కుల పరిరక్షకులు రాజకీయాలలో ఓటమి లేని నాయకులు స్వతంత్ర సమరయోధులు మాజీ భారత ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు బాబు జగ్జీవన్ రామ్ గారి లక్ష్యాలను ఆశయాలను నెరవేర్చడంలో ముందున్నారు అందుకు నిదర్శనం దళితుల అభ్యున్నతి కోసం గత తెలుగు దేశ ప్రభుత్వ హయాంలో బాబు గారు 27 సంక్షేమ పథకాలను దళితుల కోసం ప్రవేశపెట్టడం జరిగింది. దీనితోపాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు మరియు దళితజాతి ముద్దుబిడ్డ డాక్టర్ బివి జయానాగేశ్వర్ రెడ్డి తన ప్రభుత్వ హయాంలో దళితుల అభ్యున్నతి కోసం సంక్షేమం కోసం ఆ మహనీయుడు అయిన బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు గుర్తుగా ఇలాంటి మహనీయుడిని కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని. అప్పటి ఎమ్మిగనూరు స్పెషల్ కమిషనర్ జంబున్న

మున్సిపల్ లో తీర్మానం బిల్లు 153/2012, 5-10-2012 తేదీన బిల్లు ఆమోదించడం జరిగింది. కాబట్టి ఆ మహనీయుడిని కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఎమ్మిగనూరు పట్టణా దళిత ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని..పందికోన ఈరన్న ఆధ్వర్యంలో రవి ,గిడ్డయ్య ,శాంతి రాజు అందరూ కలిసి మహరాజ శ్రీ గౌరవనీయులైన ఎమ్మిగనూరు పురపాలక సంఘం రెవిన్యూ అధికారి అస్లాం గారికి వినతి పత్రాన్ని అందించడం జరిగింది.అదేవిధంగా ఎమ్మిగనూరు పట్టణా దళిత జాతి తరపున విజ్ఞప్తి చేసుకుంటున్నాము.

## ప్రసాజ్వామ్యంలో నిరంకుశం పనికిరాదు !




ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా భావించే భారతదేశంలో ఆరోగ్యకరమైన రాజకీయ వాతావరణం లేకుండా పోతోంది. అధికారం చేపట్టిన నేతలు నిరంకుశమనే విషసంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. అన్ని వ్యవస్థలతో పాటు మీడియా పైనా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారు. తాము కోరుకున్నది మీడియాలో రావాలన్న అహంకారంతో ఉన్నారు. లేకుంటే మాకు వ్యతిరేకంగా మీడియా కథనాలు రాస్తోందని అక్కసు వెళ్లగక్కుతున్నారు. అలాగే మీడియా సంస్థలపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. మీడియా ప్రతినిధులను దరిదాపుల్లోకి రాకుండా చూస్తున్నారు. సొంత మీడియాలను ప్రోత్సహిస్తూ..డబ్బా కొట్టుకుంటున్నారు. అహంకారం పతన హేతవు... ఇది అందరికీ తెలుసు.. కానీ మోడీ, మమతా బెనర్జీ, కెసిఆర్,జగన్ వీరంతా అహంకార పాలకులుగా నిలిచిపోతారనడంలో సందేహం లేదు. మోడీ దేశానికి ఏమిచేయలేదని.. మోడీ అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని అధికారంలో ఉండగా కెసిఆర్ తరచూ మండిపడుతూ వచ్చారు. కానీ కెసిఆర్ అంతకు మించిన అహంకారి అని తెలంగాణలో ఎవరిని అడిగినా చెబుతారు. ఇప్పుడాయన కేవలం తను సృష్టించుకున్న ఏకాంతంలో గడుపుతున్నారు. ప్రజల్లో ఎక్కడా కానరావడం లేదు. ఆయన ఎవరినీ దరిచేరనీయరన్నది కూడా అంతే నిజం. అధికారంలో ఉండగా జనగ్ కూడా అదే తరహాలో ఐదేళ్లు అధికారం ఏలారు. జనాలను దూరంగా పెట్టారు. నిజానికి ప్రజాస్వామ్యంలో అహంకారం, నిరంకుశం పనికిరాదు. మోడీ గురించి విమర్శలు చేస్తున్న ఇండియా కూటమి నేతలు తమగతాన్ని కూడా గుర్తు చేసుకుంటే మంచింది. తమవైపు కూడా జనం చూస్తారని గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్లు..వారిచ్చే ఓటుతో నిరంకుశంగా కాకుండా.. ప్రజాస్వామ్య యుతంగా పాలన సాగించాలి. ఓట్లేసుకోవడం ఎలాగో తెలుసుకుని రాజ్యమేలుతున్న మన రాజకీయ నేతలు అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేస్తున్నారు. ప్రజలను పురుగుల్లా చూస్తున్నారు. పోలీసులను తమ గుప్పిట్లో పెట్టుకుని పాలన చేస్తున్నారు. ప్రజల చెంతకు రావడం, వారి గురించి తెలుసుకోవడం అన్నది మరచి పోయారు. ఇలా జరుగుతుందని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహాశయుడు ఆనాడు ఊహించి ఉండరు. లేకుంటే ఎక్కడో ఒక దగ్గర చెక్ పాయింట్ పెట్టేవారు. ప్రజలకు చేరువగా ఉండాల్సిన నేతలు ప్రస్తుతం గిరిగీసుకుని తమ బంగళాలు దాటి రావడం లేదు. ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. దేశంలో మిగతా నేతల సంగతెలా ఉన్నా... మోడీ, కెసిఆర్, జగన్‌లు అహంకారంలో తారాస్థాయికి చేరుకున్నారు. నిరంకుశంలో హిట్లర్, మోసొలీలను మించారు. మోడీని ప్రశ్నించే ముందు ఈ విషయాలను తమకు తాముగా ప్రశ్నించుకుంటే బాగుండేది. ఇకపోతే తెలంగాణలో కెసిఆర్‌కు ముందు సిఎంలుగా పనిచేసిన వారెవరూ ఎవరు కూడా ఇంత నిరంకుశంగా లేరు. దివంగత ప్రజాయుద్ధనౌక గద్దర్, కోదండరామ్ తదితర తెలంగాణ ఉద్యమకారులను కూడా కెసిఆర్ దూరం పెట్టిన విషయాన్ని జనం చూశారు. ఉమ్మడి ఎపిలో చెన్నారెడ్డి లాంటి నేత కూడా ఇంత నిరంకుశంగా పాలించ లేదు. దివంగత వైఎస్ కూడా ఎప్పుడూ ప్రజల్లో ఉండేవారు. ఇప్పుడు విభజన తరవాత అటు కెసిఆర్, ఇటు జగన్ పాలనా పగ్గాలు చేపట్టాక నిరంకుశంగా వ్యవహరించడంతో పాటు ఎదుటి పార్టీలను, వ్యక్తులను గంజిలో ఈగ తీసినట్లుగా వ్యవహరించారు. రాష్ట్రాలను అప్పులకుప్పగా తయారు చేశారు. అందుకే జనం వారిని కూడా నిరంకుశంగానే దూరం పెట్టారు. ప్రజాసంక్షేమం పేరుతో డబ్బుల పందేరంతో ఖాజానాను ఊడ్చేస్తున్న నాయకులు ఎప్పటికైనా జవాబుదారీగా ఉండాల్సిందే. అధికారంలో ఉన్న వారు నిజంగా మంచి పనులు చేస్తే ప్రజలు వారిని దూరం

పెట్టరు. ప్రజలు నానా అవస్థలు పడుతున్నా వాటిపై పట్టింపు లేకుండా పాలన సాగిస్తున్నారు. ఇక బిజెపి విషయానికి వస్తే..అన్ని రాష్ట్రాల్లో పాగా వేయాలన్న సంకల్పం ఉంటే మంచిదే. అందుకు మంచి పనులు చేస్తే చాలు. ప్రజలకు ఉద్యోగ,ఉపాధి కల్పించి, జిఎస్టీ వాయింపులు లేకుండా చేసి, ధరలను అదుపులో పెట్టగలిగితే ప్రజలే నేరుగా వచ్చి ఓటేసి బిజెపిని అక్కున చేర్చుకుం టారు. అలా జరగడం లేదు కనుకనే హిమాచల్, కర్నాటకలో

దెబ్బకొట్టారు. ఈ క్రమంలో మోడీ కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలి. తమ పాలన అంతా బ్రహ్మాండంగా ఉందన్న అహంకారంలో ప్రధాని మోడీ ఉన్నారు. ఎంతో గొప్ప పాలన అందిస్తున్నామని చాటుకుంటున్నారు. త్వరలోనే రెండు రాష్ట్రాలలో జరుగ బోయే అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవాల్సి ఉంది. ఈ ఎన్నికలకు ముందు అయినా బిజెపిని ప్రజలకు చేరువ చేసేలా మోడీ ప్రజలకు చేరువ కావాలి. ప్రజాస్వామ్యాన్ని, హక్కులను, న్యాయాన్ని ప్రభుత్వాన్ని, వ్యవస్థలను కాపాడుకోవాల్సి ఉంది. పాలకులు ఇది గమనించి తమపనితీరును మెరుగు పర్చుకుంటే మంచిది. అలాకాకుండా నాయకలు తమ అహంకాన్ని వీడక పోతే కాలగర్భంలో కలసిపోక తప్పదు. ప్రజలతో మంచి అనిపించుకునేలా నిర్ణయాలు తీసుకోవాలి. కేంద్రంలో అయినా రాష్ట్రాల్లో అయినా పాలకులు నిజాయితీగా సాగాలి. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలి.

## స్వర్ణాంధ్ర - స్వచాంధ్ర కార్యక్రమంపై అవగాహన




ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఆగస్టు 23 :

నందికొట్కూరు పట్టణం ఎన్ ఎస్ ఫంక్షన్ హాల్ సమీపంలో జరిగిన స్వర్ణాంధ్ర - స్వచాంధ్ర కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత పై నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాంద్ర శివానందరెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే జయసూర్య , నియోజకవర్గ పార్టీ పరిశీలకులు దేవల్ల మురళి మరియు నియోజకవర్గ నాయకులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్ బేబీ మున్సిపల్ శాఖ అధికారులు మున్సిపల్ సిబ్బంది టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ రోడ్ లోని హాథిరాంజీ మఠం భవనంను తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్..

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,ఆగస్టు 23:**



ప్రభుత్వము దేవాలయాలకు, మఠాలకు చాలా ప్రాధాన్యత ఇస్తుందని,గాంధీ రోడ్ లోని హాథిరాంజీ మఠం భవనంను పూర్తిగా కూల్చి వేస్తామన్నది, అపోహా అని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.. శనివారం స్థానిక గాంధీ రోడ్ లోని హాథిరాంజీ మఠం భవనంను తిరుపతి శాసనసభ్యులు ఆరని శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య లతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్.. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. హాథిరాంజీ మఠం 120 సంవత్సరాలు చరిత్ర కలిగిందని తెలిపారు.మఠ%శీ% నందు హాజీరాంజి భక్తులు, స్వామీజీలు, సాధువులు, స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇక్కడ అన్నదాన కార్యక్రమాలు కూడా జరిగేవని తెలిపారు. కాలక్రమేని మఠం రీజనల్ ఎండోమెంట్ కార్యాలయము, కోర్టు కూడా ఉండేవని తెలిపారు. గడిచిన 30, 40 సంవత్సరాల నుంచి మఠం వాళ్లు 60 షాపులకు పైగా అద్దెకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ భవనం దగ్గర మెయింటెనెన్స్ సరిగా లేకపోవడం వలన కాలక్రమణి భవనం శిధిలావస్థకు చేరిందని మొదటి అంతస్తులో కొన్నిచోట్ల పగుళ్ళు, కృ%శీ%గు పోవడం జరిగిందని తెలిపారు. దీన్ని ఏడు సంవత్సరాల నుంచి మున్సిపల్ కార్పొరేషన్ వాళ్లు తరచుగా పరిశీలించడం జరిగిందని ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది కాబట్టి మఠం వాళ్లు దేవాదాయ శాఖ వారికి లేక రాయడం జరిగిందని, అనంతరం ఐఐటి నిపుణులు భవనాన్ని పరిశీలించిన రిపోర్టు మేరకు మఠం లోని పగుళ్లు, కుంగిపోయిన ప్రదేశాలను చూడడం కచ్చితంగా ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని ఐఐటి నిపుణులు తెలపడం జరిగిందని తెలిపారు. హాథిరాంజీ మఠం భవనాన్ని పూర్తిగా కూల్చివేస్తామన్నది అపోహామాత్రమేనని, కొన్నిచోట్ల పగుళ్ళు కృంగిపోవడం వల్ల భవనం శిధిలావస్థకు చేరడం జరిగిందని తెలిపారు. ఎవరికి ప్రాణం నష్టం జరగకూడదనేదే ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ మఠం బంజారా కమిటీకి సెంటిమెంటుతో కూడినదని వారి మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉండదని తెలిపారు.కుంగిన, పగుళ్ళు వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే ఏమి చేయాలన్నది ప్రత్యామ్నాయ నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఐఐటి నిపుణులు ఇచ్చిన రిపోర్టు మేరకు శాసనసభ్యులు , కమిషనర్, సాధువులు, షాప్ ఓనర్స్ తో కలిసి చర్చించుకొని తగు నిర్ణయాలు తెలపడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వానికి కూడా దేవాలయాలకు, మఠాలకు చాలా ప్రాధాన్యత ఇస్తుందని, అలాగే ప్రాణా నష్టం జరగకుండా చూడడం మా బాధ్యత అని తెలిపారు. తిరుపతి శాసనసభ్యులు మాట్లాడుతూ.. హాథిరాంజీ మఠం ను భక్తులకు విస్తీర్ణమైన ప్రదేశంలో నివాసముండి భోజనాలు చేసి కాలి నడకన తిరుమలకు వెళ్లడం ఆనవాయితగా వచ్చేది అన్నారు. హాథిరాంజీ మఠం పురాతనమైంది అని భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా భక్తులకు, ఇక్కడ ఉన్నటువంటి దుకాణాల వారికి ప్రమాదం జరగకుండా చూడాలని అధికారులకు ప్రభుత్వము ఆదేశించడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ తో కలిసి ఇక్కడ పరిస్థితులను పరిశీలించడం జరిగినదని తెలిపారు. ఐఐటి నిపుణులు నివేదిక ఇచ్చారు వారు సూచనలు సలహాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. భవనాన్ని పూర్తిగా కూల్చి వేస్తామని మీడియా ద్వారా అపోహలు రావడం జరిగిందని, తెలంగాణ, మహారాష్ట్ర, పాండిచ్చేరి మఠాధి పీఠాధిపతులు ఈ భవనాన్ని కూల్చకూడదని తెలిపారన్నారు. జిల్లా కలెక్టర్, ఐఐటి నిపుణులు ఈ భవనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని ఈ సమస్యను పరిష్కరించే దిశగా చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫుల్ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ లు ముద్ర నారాయణ, ఆర్సి మునికృష్ణ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, హస్తకళ కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, మఠం ఎ ఓ బాపిరెడ్డి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి: ఎంపీడీఓ రాణెమ్మ



**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఆగస్టు 23**

స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర లో ప్రజలందరూ భాగస్వాములవు కావాలని సి.బెళగల్ మండల అభివృద్ధి అధికారి రాణెమ్మ అన్నారు. శనివారం సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ పాండురంగన్న ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి తడి చెత్త, పొడి చెత్త , వర్షాకాలం వచ్చే జబ్బులపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు చేతులు కడుక్కోవడం అలవాటుగా మార్చుకోవాలని తెలిపారు. పాఠశాల ఆవరణంలో, ఇంటి ఆవరణంలో వర్షపు నీరు నిలువ ఉండడంతో దోమలు పెరిగి చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయని, కావున పాఠశాల, ఇంటి ఆవరణంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు కాలువలలో చెత్త తొలగించాలని, ఇంటింటి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, చెత్త కుప్పల తొలగింపు, దుస్తులను పొడిగా ఉంచుకోవడం అనే అంశంపై ఈనెల ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో శుద్ధి చేసిన నీరు త్రాగాలని తెలిపారు. అనంతరం వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. సి.బెళగల్ మండలంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగన్న, మండల కన్వీనర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్, ఎస్సీ హాస్టల్ వార్డెన్ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్ర - స్వర్ణ ఆంధ్ర లో అందరూ భాగస్వాములు కావాలి.

## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

## స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ తిరుపతి సాధిద్దాం.

## కమిషనర్ ఎన్.మౌర్య, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి



**తిరుపతి,ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 23**

స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర లో ప్రజలందరూ భాగస్వాములు కావాలనీ, స్వచ్ఛాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ తిరుపతి సాధనకు ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర %–% స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బాబు జగజ్జీవన్ రామ్ పార్కు నందు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాబు జగజ్జీవన్ రామ్ పార్కు లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, రాష్ట్ర హస్తకళల శాఖ చైర్మన్ డాక్టర్ హరి ప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డెవలప్మెంట్ డైరెక్టర్ వూకా విజయకుమార్, కార్పొరేటర్లు నరసింహ ఆచారి అధికారులు పాల్గొని మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం రామానాయుడు స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడంపై ప్రజలకు, చేతులు కడుక్కోవడం వలన కలిగే ప్రయోజనాలు, జబ్బులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతకు విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా మార్చుకోవాలని ఆయన కోరారు. వర్షపు నీరు నిల్వతో దోమలు పెరిగి చికున్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాప్తి చెందుతాయని ఆయన చెప్పారు. కాబట్టి వర్షపు నీరు ఇంటి పరిసరాల్లో నిల్వ ఉండకుండా చూడాలని ఆయన కోరారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డ్రైయిన్ లలో సిల్ట్ తీసే కార్యక్రమం క్రమం తప్పకుండా మున్సిపల్ సిబ్బంది చూస్తుందని ఆయన తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం ఒక నినాదంతో స్వచాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ఈ నెల మాన్సూన్ హైజెనీ నినాదంతో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వర్షాలు రాక ముందే నగరంలోని కాలువల్లో చెత్త తొలగించడం, ఇంటింటి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, జబ్బులు రాకుండా చేతులు కడుక్కోవడం, చెత్త కుప్పల తొలగింపు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత తమ బాధ్యతగా ముందుకు సాగితే నగరం శుభ్రంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులు ప్రతి చేతులు శుభ్రం చేసుకోవడం వలన అంటువ్యాధుల నుండి దూరంగా ఉండవచ్చునని అన్నారు. తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఒక వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా, సమాజం పట్ల మనం చూపించే బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛంద కార్యక్రమాలు విజయవంతం కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరం అని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తిరుపతి అభివృద్ధిలో పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుందనీ జాతీయస్థాయిలో తిరుపతి స్వచ్ఛత కార్యక్రమంలో అవార్డు పొందిందని గుర్తు చేశారు, తుడా పరిధిలో మున్ముందు మరిన్ని పారిశుధ్య ప్రణాళికలు అమలు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులతో కమిషనర్ స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, ప్రజా ప్రతినిధులు విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోరికలు తీర్చే స్వామి శ్రీ కోన వెంకటేశ్వరుడు

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ ఆగస్టు 23**



సి.బెళగల్ మండల పరిధిలోని క్రిష్ణ దొడ్డి గ్రామ కొండపై వెలసిన శ్రీ కోన వెంకటేశ్వర స్వామికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలి మంగమ్మ సమేత శ్రీ కోన వెంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలను చేపట్టారు. చిన్న తిరుపతిగా పేరున్న కృష్ణదొడ్డిలోని శ్రీ కోన వెంకటేశ్వరస్వామికి పూజా కార్యక్రమాలలో స్థానిక గ్రామస్తులతో పాటు సి.బెళగల్, బురాన్ దొడ్డి, పులకుర్తి, క్రిష్ణదొడ్డి, పోలకల్ ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పిం చుకున్నారు .నిర్వాహకులు కొండపై అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# శ్రీ కోదండరామాలయంలో వైభవంగా సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహనసేవ

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, ఆగస్టు 23**



తిరుపతిలోని శ్రీకోదండరామాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా సహస్ర కలశాభిషేకం, హనుమంత వాహనసేవ వైభవంగా జరిగాయి. వైఖానస ఆగమం ప్రకారం వైష్ణవాలయాల్లో పౌర్ణమి, అమావాస్య, శుక్ల ఏకాదశి, కృష్ణ ఏకాదశి, శ్రవణం, పునర్వసు నక్షత్రాలకు చాలా విశిష్టత ఉంటుంది. అమావాస్య నాడైన శనివారం ఉదయం 9 నుండి 10.30 గంటల నడుమ సహస్ర కలశాభిషేకం సేవ వైభవంగా నిర్వహించారు. రూ.500/- చెల్లించి పాల్గొన్న గృహస్తులకు(ఇద్దరు) ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక వడ బహుమానంగా అందజేశారు. కాగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హనుమంత వాహనసేవ వేడుకగా జరుగనుంది. సర్వాలంకార భూషితులైన శ్రీకోదండరామస్వామివారు తనకు ఎంతో ప్రీతిపాత్రమైన హనుమంత వాహనాన్ని అధిష్టించి ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. రామభక్తుడైన హనుమంత వాహనసేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, ఏఈవో శ్రీ రవి, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ రమేష్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఉచిత బస్సు బడుగు బలహీన మహిళలకు వరం







## రాజకీయాలలో మహిళలు ప్రధాన పాత్ర టిడిపి ప్రభుత్వం ఇస్తుంది

## ఎమ్మెల్యే గిత్త జయసూర్య

## నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మానవ శివానందరెడ్డి ముఖ్యఅతిథి

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు ఆగస్టు 23**

మహిళల ఆర్థిక సాధికారితే తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా పెట్టుకొని ఉచిత బస్సు బడుగు బలహీన మహిళలకు వరము లాంటిదని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోనీ అల్లూరు రోడ్డులో కళ్యాణ మందిరం లో ఏర్పాటు చేసిన శ్రీ శక్తి పథకం ఉచిత బస్ అభినంద సభ కు ఎమ్మెల్యే నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి లు ముఖ్యఅతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి స్త్రీ శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమ వుతుం దన్నారు . రాజకీయాలలో మహిళలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. మహిళలకు రిజర్వేషన్ లో 33శాతం అవకాశం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదన్నారు. ఉచిత బసు పథకం బడుగు బలహీన వర్గ మహిళలకు వరమన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి మహిళ సాధికారత, మహిళా స్వావలంబనను దృష్టిలో ఉంచుకొనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళ అభ్యున్నతికై పెద్దపీట వేశారని అన్నారు. అదేవిధంగా మంత్రి నారా లోకేష్ స్త్రీ శక్తి విధానాన్నే సూపర్ సిక్స్ పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం మహిళలు సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమం లో టీడీపీ నియోజకవర్గం పరిశీలకులు దేవల్ల మురళి, నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, కాతా రమేష్ రెడ్డి, గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, పలుచాని మహేశ్వర రెడ్డి, వంగాల శివరామి రెడ్డి,గిరీష్ రెడ్డి, జనసేన నందికొట్కూరు ఇంచార్జి రవికుమార్, నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ మూర్తు జావలి, పగిడ్యాల సొసైటీ చైర్మన్ దామోధర్ రెడ్డి, తర్తూరు దేవాదాయ కమిటీ చైర్మన్ మందాడి నారాయణ రెడ్డి , కేసి కాలువ డీసి చైర్మన్ పరమేశ్వర రెడ్డి, టీడీపీ మహిళా నాయకురాలు ప్రసన్న రెడ్డి, పట్టణ మహిళా నాయకురాలు మీనాక్షి దేవి, వనజ, తదితరులు పాల్గొన్నారు.

# దళితుల సంక్షేమం పట్టని పాలకుల వైఖరిని ఎండగడదాం

– కెవిపిఎస్ పిలుపు




**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి** ఎమ్మిగనూరు ఆగస్టు 23 శనివారం

దళితుల సంక్షేమం పట్టని పాలకుల వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమిద్దామని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ దేవ సహాయం, ఎండి ఆనంద్ బాబు, ఉపాధ్యక్షులు బి కరుణాకర్ పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని కెవిపిఎస్ కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు దేవ సహాయం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకులు మారిన దళితుల పరిస్థితులు మారడం లేదన్నారు. ప్రగల్బాలు పలుకుతూ ముందుకు వచ్చిన కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమాన్ని పూర్తిగా అటకెక్కించిందన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శించి కార్పొరేషన్ రుణాలకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, ఒక్క సారిగా ఏడు లక్షల మంది యువకులు దరఖాస్తు చేసుకునే లోపు, రుణాలను చాప చుట్టేసిందన్నారు. దళితపేటలన్నీ సమస్యలకు నిలయాలుగా మారాయని ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం 2013 క్రింద నిధులను కేటాయించి, వాటిని దళిత పీటల దళితుల ప్రత్యక్ష ప్రయోజనాలకు ఖర్చు చేయడంలోనూ విఫలమైందన్నారు. దళితులపై రోజువారిగా దాడులు దౌర్జన్యాలు పెరుగుతున్న పట్టనట్లు చోద్యం చూస్తుందన్నారు. దళిత సమస్యలపై సంఘటిత ఉద్యమాలు నిర్మించేందుకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు హెచ్ జయరాజు, జిల్లా సహాయ కార్యదర్శులు బి తిక్కప్ప, చిన్న మారయ్య, తిమ్మన్న, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ హనుమంతు, జి అంజి, నాగరాజు, అంతోని, గుంటేప్ప, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పన్ను విధానంలోనూ టాక్స్ తగ్గింపులు



పన్ను చెల్లింపుదారులు ఐటీ రిటర్న్లు దాఖలు చేసే ముందు అన్ని విషయాలు తెలుసుకోవాలి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ఐటీఆర్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. అందుకోసం పన్ను తగ్గింపులు, మినహాయింపులు పొందొచ్చు. పాత పన్ను విధానంలో పన్ను తగ్గించుకునేందుకు ఎక్కువ వెసులుబాటు ఉండగా.. కొత్త పన్ను విధానంలో కూడా కొన్ని మినహాయింపులు పొందొచ్చు. అవేంటో తెలుసుకుందాం.

టాక్స్‌పేయర్లకు ప్రస్తుతం రెండు పన్ను విధానాలు అందుబాటులో ఉన్నాయి. పాత పన్ను విధానంలో మాత్రం పెద్దగా మార్పులు చేయట్లేదు. గత రెండు సార్లు బడ్జెట్ సందర్భంగా.. కొత్త పన్ను విధానంలోనే కీలక మార్పులు చేసింది. కేంద్ర బడ్జెట్ - 2023 సమయంలోనే డిఫాల్ట్‌గా కొత్త పన్ను విధానం ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. కావాలనుకుంటే.. పాత పన్ను విధానంలోకి కూడా మారేందుకు వెసులుబాటు ఉంటుంది. అయితే.. ఐటీ రిటర్న్లు డెడ్‌లైన్ ముగిసిన తర్వాత.. బిలేటెడ్ రిటర్న్లు సమయంలో మాత్రం కొత్త పన్ను విధానంలో ఐటీ రిటర్న్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. కొత్త పన్ను విధానంలో ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితి సహా ఇతర రాయితీల్ని పెంచడంతో పన్ను చెల్లింపుదారులకు మరింత ఆకర్షణీయంగా దీనిని మార్చింది. పాత పన్ను విధానంలోనే ఎక్కువగా టాక్స్ బెనిఫిట్స్ ఉండగా.. కొత్త పన్ను విధానంలోనూ కొన్ని మినహాయింపుల్ని క్లెయిమ్ చేసుకునేందుకు వీలుంది. అవేంటో ఇప్పుడు మనం చూద్దాం.అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభుత్వ పథకాలైనటువంటి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, ఈఎల్ఎస్ఎస్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి వాటిల్లో పన్ను తగ్గించుకునేందుకు కొత్త పన్ను విధానంలో ఛాన్స్ లేదు. అయితే ఇక్కడ బెనిఫిట్స్ మాత్రం పొందొచ్చు.

స్టాండర్డ్ డిడక్షన్ జీతం ద్వారా ఆదాయం అందుకుంటున్న ఉద్యోగులు, పెన్షనర్లు.. కొత్త పన్ను విధానంలో రూ. 75 వేల వరకు ప్రామాణిక తగ్గింపు పొందొచ్చు. నేరుగా ఈ మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ ప్రామాణిక తగ్గింపును ఆటోమేటిక్‌గా పరిగణనలోకి తీసుకుంటాయి. దీని కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సిన పని లేదు.ఉద్యోగులు.. నేషనల్ పెన్షన్ స్కీమ్ అకౌంట్‌కు.. సంస్థ యజమాని అందించే సహకారంపై కొత్త పన్ను విధానంలో మినహాయింపు పొందొచ్చు. ఈ మినహాయింపు సెక్షన్ 80 (2) కిందికి వస్తుంది. ప్రైవేట్ రంగ ఉద్యోగులు.. అతను లేదా ఆమె జీతంలో (బేసిక్ పే ప్లస్ డీఏ) గరిష్టంగా 10 శాతానికి సమానమైన మొత్తం క్లెయిమ్ చేసుకోవచ్చు. సాధారణంగా కాంట్రిబ్యూషన్లపై సెక్షన్ 80 కింద రూ. 1.50 లక్షలు, సెక్షన్ 80 (1) కింద రూ. 50 వేల వరకు మినహాయింపు లభిస్తుంది. ఇది కొత్త పన్ను విధానానికి అందుబాటులో లేవు.

అగ్నివీర్ అగ్నిపథ్ స్కీమ్ 2022 కింద నమోదు చేసుకున్న వ్యక్తులు.. అగ్నివీర్ కార్పస్ ఫండ్‌లో జమ చేసిన మొత్తంపై సెక్షన్ 10 కింద పన్ను మినహాయింపు ఉంటుంది. ఇందుకోసం సెక్షన్ 80 ప్రతిపాదించారు. ఆదాయపు పన్ను శాఖ ప్రకారం.. అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు చేసిన విరాళాలకు సమానంగా తగ్గింపు పొందొచ్చు. ఇది పాత, కొత్త పన్ను విధానాల్లో అందుబాటులో ఉంటుంది. వ్యాపార సంస్థలు.. బోర్డులోకి కొత్త ఉద్యోగుల్ని తీసుకున్నప్పుడు.. పన్ను తగ్గింపులకు ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ అనుమతిస్తుంది.

సీనియర్ సిటిజెన్స్- పాత పన్ను విధానంలో సీనియర్ సిటిజెన్స్‌కు కనీస ఆదాయ మినహాయింపు పరిమితి రూ. 3 లక్షలు కాగా.. సూపర్ సీనియర్ సిటిజెన్స్‌కు రూ. 5 లక్షలు పరిమితిగా ఉంది. ఇక కొత్త పన్ను విధానంలో ఇది రూ. 7 లక్షలుగా ఉంది.

## ఎప్పుడెప్పుడు విత్ డ్రా చేయొచ్చు?



సంఘటిత రంగంలో పనిచేసే ఉద్యోగులకు పీఎఫ్ అకౌంట్ ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఈపీఎఫ్ ఫండ్స్ అనేది రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఉద్దేశించిందే అయినప్పటికీ.. మధ్యలో కొన్ని అవసరాలకు కొంత మొత్తంలో డబ్బు విత్‌డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. విద్య, వైద్యం, వివాహం, ఇల్లు నిర్మాణం వంటి సందర్భాల్లో పాక్షికంగా క్యాష్ విత్‌డ్రా చేసుకోవచ్చు. ఎప్పుడెప్పుడు.. ఎంత తీసుకోవచ్చనేది ఇప్పుడు చూద్దాం.

ఎప్పుడెప్పుడు డబ్బులు తీసుకోవచ్చు.. ఎంతొస్తాయి. ఇలా క్లారిటీ ఉందా.? పీఎఫ్ గురించి అన్ని వివరాలు తెలుసుకోవాలి. అన్నింటిపై అవగాహన పెంచుకోవాలి. సంఘటిత రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్ ఖాతా ఉంటుంది. దీనిని ఈపీఎఫ్ఓ నిర్వహిస్తుంటుంది. కంపెనీ ప్రతి నెలా మీ జీతంలో నుంచి 12 శాతం పీఎఫ్ అకౌంట్లో వేస్తుంది. కంపెనీ కూడా ఇంతే మొత్తం యాడ్ చేయాలి. ఇందులో పీఎఫ్ అకౌంట్లోకి 3 శాతానికిపైగా వెళ్తుంది. మరో 8 శాతానికిపైగా ఈపీఎస్ అకౌంట్లో యాడ్ అవుతుంది. ఇక ప్రతి ఆర్థిక సంవత్సరం చివర్లో.. పీఎఫ్ నిధులపై కేంద్రం వడ్డీ అందిస్తుంది. ప్రస్తుతం 8.25 శాతం వడ్డీ వస్తుంది.ఈపీఎఫ్‌లో జమవుతున్న నగదు మొత్తం.. రిటైర్మెంట్ కోసం ఉద్దేశించిందే అయినప్పటికీ చందాదారులు కొన్ని సందర్భాల్లో పూర్తిగా లేదా పాక్షికంగా నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పిస్తోంది. వైద్య చికిత్సలు, ఇంటి రెనోవేషన్, వివాహం, చదువులు వంటి సందర్భాల్లో ఈ నిధుల నుంచి డబ్బులు తీసుకోవచ్చు. దీని గురించి చూద్దాం. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ విత్‌డ్రా కోసం మీ దగ్గర యూఏఎన్ నంబర్, పాస్‌వర్డ్ ఉండాలి. ఇది యాక్టివేషన్లో ఉండాలి. కేవైసీ పూర్తి చేసి ఉండాలి. ఇ- నామినేషన్ ఫైల్ చేసి ఉండాలి. మొబైల్ నంబర్ కూడా అప్డేట్‌లో ఉండాలి. ఆధార్ సీడింగ్ పూర్తి చేసి ఉండాలి. ఇవన్నీ కచ్చితంగా ఉంటేనే.. విత్‌డ్రా కుదురుతుంది. ఆఫ్‌లైన్‌లో అయితే నేరుగా ఈపీఎఫ్ఓ కార్యాలయానికి వెళ్లి ఫారం నింపి.. రిలేటెడ్ డాక్యుమెంట్స్ సమర్పించి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

ఉద్యోగం నుంచి రిటైర్ అయినప్పుడు.. రెండు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నిరుద్యోగిగా ఉన్నప్పుడు పూర్తి మొత్తం విత్‌డ్రా చేసుకోవచ్చు. రిటైర్మెంట్ కంటే ముందే ఉద్యోగి మరణిస్తే.. కుటుంబసభ్యులు పీఎఫ్ విత్‌డ్రా చేసుకోవచ్చు.

## మళ్లీ షాకిస్తున్న బంగారం ధరలు..

భారతీయులకు బంగారం అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ముఖ్యంగా భారతీయ మహిళలు.. పెళ్లిళ్లు, పండగలు, ఇతర వేడుకల సమయాల్లో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ఈ క్రమంలో డిమాండ్ కూడా ఉంటుంది. అయితే బంగారం ధరలే తరచుగా మారుతుంటాయి. ఇది అంతర్జాతీయ విపణికి అనుగుణంగా ట్రేడవుతుంటుందని చెప్పొచ్చు. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతుంది. అక్కడ తగ్గితే ఇక్కడా తగ్గుతుంది. అంతర్జాతీయ మార్కెట్లో, అదే విధంగా బంగారం, వెండి రేట్లు ఇప్పుడు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్నాయి. ఇటీవల యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వరుసగా మూడో సారి వడ్డీ రేట్లను తగ్గించినప్పటి నుంచి.. గోల్డ్ రేట్లు అంతలా తగ్గట్లేదు. ఈ క్రమంలోనే ఇప్పుడు వరుసగా 3 రోజుల్లో స్వల్పంగా పెరుగుకుంటూ వచ్చాయి.ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో చూస్తే పసిడి ధర ఒక్కరోజు రూ. 250 పెరిగి 22 క్యారెట్లపై తులం రూ. 71,500 వద్ద కొనసాగుతోంది. అంతకుముందు కూడా వరుసగా రెండు రోజుల్లో రూ. 250, రూ. 100 చొప్పున పెరిగింది. ఇక 24 క్యారెట్ల బంగారం ధర విషయానికి వస్తే.. రూ. 270 పెరగడంతో ప్రస్తుతం 10 గ్రాములకు రూ. 78 వేలు పలుకుతోంది. ఇక్కడ దీనికి ముందు రెండు రోజులు రూ. 280, రూ. 100 చొప్పున పెరిగాయి. ఇదే సమయంలో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో కూడా గోల్డ్ రేట్లు పెరిగాయి. ఒక్కరోజే రూ. 250 పెరగడంతో ప్రస్తుతం 22 క్యారెట్ల పసిడి ధర తులం రూ. 71,650 కి చేరింది. 24 క్యారెట్ల పుత్తడి ధర 10 గ్రాములు రూ. 78,150 వద్ద ఉంది.




## ఇన్వెస్టర్లను ముంచేసిన 4 టాటా స్టాక్స్..

భారతదేశంలో మార్కెట్ విలువ పరంగా అతిపెద్ద సంస్థల్లో టాటా గ్రూప్ ముందువరుసలో ఉంటుంది. టాటా గ్రూప్ కింద డజనుకుపైగా కంపెనీలు స్టాక్ మార్కెట్లో లిస్టయి ఉన్నాయి. ఆ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ వంటివి ఉంటాయని చెప్పొచ్చు. అయితే.. కొన్నేళ్లుగా మల్టీబ్యాగర్ రిటర్న్లు అందిస్తున్న టాటా గ్రూప్ స్టాక్స్.. ఈ ఏడాదిలో అంతలా రాణించలేదు. పైగా 4 స్టాక్స్ ఇన్వెస్టర్లకు నష్టాల్ని మిగిల్చాయి.

టాటా గ్రూప్ స్టాక్స్.. కొన్నాళ్లుగా ఇన్వెస్టర్లకు మల్టీబ్యాగర్ రిటర్న్లు అందించాయి. టాటా గ్రూప్ మార్కెట్ విలువ రూ. 34 లక్షల కోట్లకుపైగా ఉంది. భారత్‌లో మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా అతిపెద్ద సంస్థ ఇదే. కంపెనీల పరంగా చూస్తే రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో ఉంది. టాటా గ్రూపులో చాలా కంపెనీలు ఇటీవలి కాలంలోనే ఎక్కువగా రాణించాయని చెప్పొచ్చు. అయితే 2024లో మళ్లీ కొన్ని స్టాక్స్ నష్టాల్నే అందించాయి. టాటా గ్రూప్ నుంచి 4 స్టాక్స్..2024లో కనీసం 15 శాతం నష్టపోయాయి. అత్యధికంగా నష్టపోయిన స్టాక్, ఇన్వెస్టర్లకు నష్టాల్ని మిగిల్చిన స్టాక్ టాటా టెక్నాలజీస్. తర్వాత ఇదే లిస్టులో టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, టాటా ఎల్క్సీ, టాటా టెలిసర్వీసెస్ (మహారాష్ట్ర) వంటివి ఉన్నాయి.టాటా టెక్నాలజీస్ 2023లోనే స్టాక్ మార్కెట్లలో లిస్టయింది. ఇది లిస్టింగ్‌తోనే మల్టీబ్యాగర్ రిటర్న్లు ఇచ్చింది. 140 శాతానికిపైగా ప్రీమియం నమోదు చేయగా.. మళ్లీ అప్పర్ సర్క్యూట్లు కొట్టి లిస్టింగ్ రోజే ఆల్ టైమ్ గరిష్టాల్ని తాకింది. అక్కడి నుంచి మళ్లీ పడిపోతూ వచ్చింది. ఈ క్రమంలోనే 2024లో ఈ స్టాక్ 23 శాతం తగ్గింది. ఈ స్టాక్ గరిష్ట విలువ అయిన రూ. 1217.95 కు 26 శాతం దూరంలో ఉంది. ఈ షేరు ధర ఇప్పుడు రూ. 899.95 గా ఉంది.

టాటా గ్రూప్ నుంచి టాటా టెక్ తర్వాత ఇన్వెస్టర్లకు ఎక్కువ నష్టాల్ని మిగిల్చింది టాటా ఎల్క్సీ. ఇది 2024 సంవత్సరంలో 22 శాతం తగ్గింది. 52 వారాల గరిష్ట ధర నుంచి 24 శాతం దూరంలో ఉంది. ఇది రూ. 6870 గా ఉంది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ షేరు ధర కూడా ఈ సంవత్సరంలో 15 శాతం పతనమైంది. ఈ స్టాక్ కూడా 52 వారాల గరిష్ట ధర నుంచి చూస్తే 32 శాతం దూరంలో ఉండటం గమనార్హం. 2014-19 మధ్యలో టాప్ 100 వెల్త్ క్రియేటర్స్ లిస్టులో టాటా కన్స్యూమర్ కూడా ఉండటం విశేషం. ఈ స్టాక్ ధర రూ. 906.90 వద్ద ఉంది. టాటా టెలిసర్వీసెస్ స్టాక్ కూడా ఇదే విధంగా 15.5 శాతం తగ్గింది. ఈ షేరు ధర రూ. 76.70 గా ఉంది.

## మస్క్, ట్రంప్ మద్దతుదారుల మధ్య చిచ్చు..!



నవంబరులో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. తొలిసారి ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు కంటే ఇప్పుడు వారి పట్ల సానుకూలత ప్రదర్శిస్తున్నట్టు అవగతమవుతోంది. చట్టబద్ధమైన వలసలకు మస్క్ మద్దతు ఇస్తుంటే.. రిపబ్లికన్ పార్టీలోని ట్రంప్ మద్దతుదారులు దీన్ని వ్యతిరేకిస్తున్నారు.

ఇమ్మిగ్రేషన్ అంశం అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ పార్టీ... ఎలాన్ మస్క్ మధ్య చిచ్చు రేపుతోంది. చట్టబద్ధమైన వలసలకు మస్క్ మద్దతు ఇస్తుంటే.. రిపబ్లికన్ పార్టీలోని ట్రంప్ మద్దతుదారులు అమెరికా ఫస్ట్ అనే నినాదానికి కట్టుబడి ఉన్నారు. దాంతో వివాదం మొదలైంది. ఈక్రమంలో ఎలాన్ మస్క్ ఎక్స్ (ట్విట్టర్)లో పెట్టి పోస్ట్ మరింత అగ్గి రాజేసింది. ధిక్కరించే మూరు?లను రిపబ్లికన్ పార్టీ నుంచి తొలగించాలని ఘాటుగా ట్వీట్ చేశారు. అమెరికాకు 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఈ క్రమంలో తన కార్యవర్గంలోకి పలువుర్ని తీసుకుంటున్నారు. వీరిలో భారతీయ అమెరికన్లు సైతం ఉన్నారు. ఇప్పటివరకు ఐదుగురు భారతీయులను తన యంత్రాంగంలో నియమించారు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై శ్వేతసౌధం సీనియర్ పాలసీ సలహాదారుగా శ్రీరామ్ కృష్ణన్‌ను ఎంపిక చేయడం విమర్శలకు దారితీసింది. నైపుణ్యం కలిగిన విదేశీ వృత్తినిపుణుల కోసం గ్రీన్‌కార్డుల విషయంలో ఉన్న పరిమితులను ఎత్తివేయాలని గతంలో శ్రీరామ్ డిమాండ్ చేశారు. దీంతో శ్రీరామ్ నియామకాన్ని ట్రంప్ మద్దతుదారుల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.

దక్షిణాఫ్రికా పౌరుడైన ఎలాన్ మస్క్.. అమెరికాకు హెచ్-1బీ వీసాపై వలస వచ్చారు. ప్రతిభ ఎక్కడున్నా దానిని అందిపుచ్చుకోవాలని ఎప్పుడూ అంటూ ఉంటారు. "మీ టీమ్ విజయం సాధించాలంటే.. అద్భుతమైన ప్రతిభావంతులు ఎక్కడున్నా మన టీమ్‌లో చేర్చుకోవాలి" అని ఓ సందర్భంలో అన్నారు. భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి సైతం మస్క్ వాదనను సమర్థిస్తారు. భారత్ నుంచి వలసవచ్చిన కుటుంబంలో జన్మించిన ఆయన... అమెరికా సంస్కృతిలో ఉన్న లోపాలను ఎత్తి చూపారు. లోటుపాట్లు ఉన్న ఈ కల్చర్ అత్యుత్తమ ఇంజినీర్లను తయారుచేయడం లేదని.. అందు కారణంగా దిగ్గజ సంస్థలన్నీ విదేశాల నుంచి నైపుణ్యం కలిగిన వ్యక్తులను నియమించుకుంటున్నాయనే అర్థంలో విమర్శలు చేశారు. అయితే, రిపబ్లికన్ పార్టీకి చెందిన సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ భిన్నంగా స్పందించారు. 'నేను సౌత్ కరోలినా గవర్నర్‌గా ఉన్నప్పుడు నిరుద్యోగిత రేటు 11 నుంచి 4 శాతానికి తగ్గిపోయింది.. విదేశీ ఉద్యోగులకు బదులు పెట్టుబడులను మాత్రమే ఆహ్వానించాం కాబట్టే అది సాధ్యమైంది... కొత్త ఉద్యోగాల కోసం నైపుణ్య శిక్షణ ఇవ్వడం వల్ల ఇప్పుడు విమానాలు, ఆటోమొబైల్ రంగాల్లో రాణిస్తున్నారు. సాంకేతికంగా బలోపేతం చేయాలని అనుకుంటే ముందు విద్యా రంగంపై దృష్టిపెట్టాలి.. అంతేగానీ అమెరికన్లను తక్కువ అంచనా వేయొద్దు' అని రామస్వామి వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఎలాన్ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాగా, ఇమ్మిగ్రేషన్‌పై ట్రంప్ అస్థిరమైన వైఖరి గందరగోళానికి గురిచేస్తోంది. మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్-1బీ వీసాలపై కఠిన ఆంక్షలు విధించారు. అయితే, ఇటీవల ఆయన ప్రకటనలు చూస్తే వలసదారుల విషయం ఆయన సానుకూల వైఖరి ప్రదర్శిస్తున్నట్టు అర్థమవుతోంది. ఈ ఏడాది ఆరంభంలో పోడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో.. అమెరికా యూనివర్సిటీలు విదేశీ గ్రాడ్యుయేట్‌లకు గ్రీన్ కార్డ్‌లను మంజూరు చేయడానికి మద్దతు ఇచ్చారు. దీంతో ఇమ్మిగ్రేషన్ విధానంలో అనిశ్చిత నెలకుంది.

## డ్రెస్ కోడ్ లేదని ఊడిన యువతి జాబ్..

### ఆమెకు రూ.32 లక్షలు చెల్లించాలని కంపెనీకి ఆదేశాలు

డ్రెస్ కోడ్ పాటించకపోవడం ఆ యువతి ఉద్యోగానికే ఎసరు తెచ్చింది. స్పోర్ట్ షూ వేసుకెళ్లినందుకు గాను ఆ యువతిని ఆ కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించింది. అయితే అందరిలా ఆ యువతి ఆ ఉద్యోగం వదిలేసి.. మరో జాబ్ చూసుకోలేదు. తనను ఉద్యోగం నుంచి అన్యాయంగా తొలగించారని.. న్యాయపోరాటం చేసింది. చివరికి అందులో విజయం సాధించడంతో.. ఆ కంపెనీకి షాక్ తగిలింది. ఆ యువతికి పరిహారం కింద రూ.32 లక్షలు చెల్లించాలని ఉద్యోగ ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది.

ప్రైవేటు ఉద్యోగాలు అంటే ఎప్పుడు ఉంటాయో ఎప్పుడు పోతాయో తెలియదు. మనకు నచ్చకపోయినా, కంపెనీకి నచ్చకపోయినా.. ఉద్యోగం పోయేది మనదే. ఇది అందరు ప్రైవేటు ఉద్యోగులకు తెలిసిందే. అయితే కొన్ని కంపెనీల్లో ఉండే రూల్స్ అండ్ కండీషన్స్ చాలా కఠినంగా ఉంటాయి. వాటిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అలా కాదని ఎవరైనా గీత దాటితే మాత్రం వేటు తప్పదు. ఇక ఒక యువతికి మాత్రం ఊహించని అనుభవం ఎదురైంది. ఉద్యోగంలో చేరిన కొత్తలోనే ఆ యువతి నిబంధనలు పాటించడం లేదంటూ సదరు కంపెనీ ఆమె ఉద్యోగాన్ని ఊడగొట్టింది. దీంతో షాక్ అయిన ఆ యువతి.. ఉద్యోగ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా.. ఆమెకు అక్కడ న్యాయం దొరికింది. ఆమెను ఉద్యోగం నుంచి అకారణంగా తీసేశారని గుర్తించిన ఉద్యోగ ట్రిబ్యునల్ ఆ యువతికి పరిహారం అందించాలని కంపెనీని ఆదేశించింది.

లండన్‌లో జరిగిన ఈ సంఘటన ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆఫీస్‌లో డ్రెస్ కోడ్ పాటించలేదని ఓ మహిళను ఉద్యోగం నుంచి తొలగించిన ఘటనలో ఓ కంపెనీకే పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఉద్యోగం నుంచి ఆమెను అవసరంగా తొలగించాలని గుర్తించిన ఉద్యోగ ట్రిబ్యునల్.. ఆమెకు పరిహారంగా 30 వేల పౌండ్లు అంటే మన భారత కరెన్సీలో ఏకంగా రూ.32.20 లక్షలు చెల్లించాలని ఆదేశించింది. ఎలిజబెత్ బెనాస్సీ అనే 18 ఏళ్ల యువతి 2022లో లండన్‌లోని మ్యాక్సిమస్ యూకే సర్వీసెస్‌లో ఒక ఉద్యోగానికి ఎంపికైంది.

అయితే ఆమె ఉద్యోగంలో చేరిన కొన్ని రోజులకే ఆమె డ్రెస్ కోడ్ పాటించకుండా.. ఆఫీస్‌కు స్పోర్ట్స్ షూ వేసుకు వచ్చిందని గుర్తించిన యాజమాన్యం.. ఆమెను ఉద్యోగం నుంచి తొలగించింది. దీంతో ఆమె ఉద్యోగ ట్రిబ్యునల్‌కు వెళ్లి తన గోడును వెళ్లబోసుకుంది. అయితే ఆ కంపెనీకి డ్రెస్ కోడ్ ఉందని తనకు సమాచారం తెలియదని సదరు యువతి పేర్కొంది. అంతేకాకుండా తెలియకుండా తాను స్పోర్ట్స్ షూ వేసుకుని ఆఫీస్‌కు వెళ్లినందుకు అందులోని ఓ మేనేజర్ తనను తీవ్రంగా అవమానించారని తెలిపింది.

అయితే ఎలిజబెత్ బెనాస్సీ చేసిన ఆరోపణలను సదరు కంపెనీ తీవ్రంగా వ్యతిరేకించింది. తాము నిబంధనలను అతిక్రమించి ఎలాంటి తప్పు చేయలేదని ఆ కంపెనీ పేర్కొంది. ఇరువైపులా వాదనలు విన్న ఉద్యోగ ట్రైబ్యునల్ ఎలిజబెత్ బెనాస్సీకే మద్దతుగా తీర్పును వెలువరించింది.

ఈ క్రమంలోనే అకారణంగా ఉద్యోగం తొలగించినందుకు.. ఆమెకు రూ.32 లక్షలు పరిహారం ఇవ్వాలని తెలిపింది. అయితే ఆ యువతి ఉద్యోగానికి కొత్త అని.. డ్రెస్ కోడ్ గురించి ఆమెకు పూర్తిగా తెలియకపోవచ్చని పేర్కొంది. అది పొరపాటుగా భావించి.. ఆమెకు మరో అవకాశం ఇవ్వకుండా అన్యాయంగా ఉద్యోగం నుంచి తీసేయడం తప్పు అని ఉద్యోగ ట్రైబ్యునల్ వెల్లడించింది.

## 30 సెకన్లలోనే షాపింగ్ మాల్‌ను ఖాళీ చేసిన కస్టమర్లు..

షాపింగ్ మాల్స్‌లో ఏమైనా ఆఫర్లు ఉన్నాయని తెలిస్తే చాలు అంతా ఎగబడుతుంటారు. ఉదయం నుంచే అక్కడ పడిగాపులు కాస్తూ అందరికంటే ముందు అన్నీ కొనేయాలనుకుంటారు. అలాగే అనుకున్నారు అక్కడి యువత. స్థానికంగా ఉన్న ఓ షాపింగ్ మాల్‌లో భారీ ఆఫర్ ప్రకటించగా.. ఒక్కసారిగా వందలాది మంది షాపులోకి చొరబడ్డారు. కేవలం 30 సెకన్లలోనే షాపు మొత్తాన్ని ఖాళీ చేశారు. అయితే ఆ సమయంలో తొక్కిసలాట కూడా జరిగింది కానీ అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ జరగలేదు.

పండుగలు, పబ్బాలు వస్తున్నాయంటే చాలు అనేక షాపింగ్ మాల్స్ అదిరిపోయే ఆఫర్లు పెడుతూ కస్టమర్లను ఆకర్షిస్తుంటారు. వాటిని అందిపుచ్చుకోవడానికి ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలి వెళ్తూ.. రచ్చ రచ్చ చేస్తుంటారు. ఎంత మంది ఉన్నా సరే తోసుకుంటూ వెళ్లి మరీ నచ్చినవి కొనుక్కుంటారు. అంత మందిలో తమకు ఏమైనా అవుతుందన్న భయం కంటే కూడా.. ఆఫర్ ఎక్కడ మిస్ అయిపోతామేనని ఎక్కువగా జంకుతుంటారు. సేమ్ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది ఆస్ట్రేలియాలో. కాకపోతే గంటల తరబడి వేచి చూడకుండా అర నిమిషంలోనే ఆ షాపును మొత్తం ఖాళీ చేసేశారు.

ఆస్ట్రేలియా పెర్త్‌లోని "స్ట్రీట్ ఎక్స్" షాపు యజమాని డేనియల్ బ్రాడ్ షా.. ప్రతీ పండుగకు అదిరిపోయే ఆఫర్ ప్రకటిస్తూ.. వినియోగదారులను ఆకర్షిస్తూ ఉంటారు. ముఖ్యంగా ఆయన పెట్టే ఆఫర్లు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. అందుకే ఆ షాపింగ్ మాల్‌లో ఎప్పుడు, ఎలాంటి ఆఫర్ పెట్టిన అక్కడి ప్రజలు అస్సలే మిస్ చేసుకోరు. అయితే క్రిస్మస్,



బాక్సింగ్ డే సందర్భంగా డిసెంబర్ 26వ తేదీ రోజు డేనియల్ బ్రాడ్ షా.. ఓ అద్భుతమైన ఆఫర్ ప్రకటించారు.

ఆఫర్ అనగానే తక్కువ ధరకే వస్తువులున్నీ ఇస్తున్నారేమో అనుకుంటున్నారమో అంతకు మించిన ఆఫర్ ఇది. ఎవరికి నచ్చిన వస్తువులు వాళ్లు తీసుకుని డబ్బులు కట్టకుండానే ఇంటికి వెళ్లిపోవచ్చు. డేనియల్ బ్రాడ్ షా ప్రకటించిన ఈ ఆఫర్ తెలుసుకున్న ప్రజలు ఉదయమే ఆ షాపింగ్ మాల్ వద్దకు వచ్చారు. వారందరినీ వీధి చివరన నిలబెట్టిన డేనియల్ బ్రాడ్ షా.. షాపింగ్ మాల్ ఓపెన్ చేయగానే వెళ్లమన్నారు. దీంతో వాళ్లంతా ఒక్కసారిగా పరుగులు పెట్టారు. ఈక్రమంలోనే తొక్కిసలాట కూడా జరిగింది. అనేక మంది కింద పడిపోయారు. అయినా అదేం పట్టించుకోకుండా వెంటనే లేచి షాపులోకి పరుగులు పెట్టారు.

కేవలం అర నిమిషంలోనే అక్కడి ప్రజలంతా ఆ బట్టల దుకాణాన్ని ఖాళీ చేశారు. అనేక రకాల బట్టలతో పాటు మరెన్నో

**ఆస్ట్రేలియా పెర్త్‌లోని "స్ట్రీట్ ఎక్స్" షాపు యజమాని డేనియల్ బ్రాడ్ షా.. ప్రతీ పండుగకు అదిరిపోయే ఆఫర్ ప్రకటిస్తూ.. వినియోగదారులను ఆకర్షిస్తూ ఉంటారు. ముఖ్యంగా ఆయన పెట్టే ఆఫర్లు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. అందుకే ఆ షాపింగ్ మాల్‌లో ఎప్పుడు, ఎలాంటి ఆఫర్ పెట్టిన అక్కడి ప్రజలు అస్సలే మిస్ చేసుకోరు. అయితే క్రిస్మస్, బాక్సింగ్ డే సందర్భంగా డిసెంబర్ 26వ తేదీ రోజు డేనియల్ బ్రాడ్ షా.. ఓ అద్భుతమైన ఆఫర్ ప్రకటించారు.**

వందల వస్తువులను దోచేశారు. కేవలం 30 సెకన్లలోనే షాపు ఖాళీ అవ్వడం చూసి యజమాని డేనియల్ బ్రాడ్ షా కూడా షాక్ అయ్యారు. ఇదిలా ఉండగా.. అంతమంది ప్రజలు షాపు ముందు ఉండడం చూసిన పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఏమైందని ప్రశ్నించగా.. డేనియల్ ప్రకటించిన ఆఫర్ గురించి తెలుసుకున్నారు. తొక్కిసలాట జరిగిందని గుర్తించి.. డేనియల్‌ను విచారించారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని చెప్పగా పోలీసులు వెనుదిరిగారు.

ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా.. నెటిజెన్లు షాక్ అవుతున్నారు. రేయ్ ఎవర్రా మీరంతా అని కొందరు, ఆస్ట్రేలియాలో కరువ్ బ్యాచ్ అంటూ మరికొందరు తమ మనసులోని భావాలను కామెంట్ల రూపంలో వెల్లడిస్తున్నారు. ఓ నెటిజెన్ అయితే.. ఆఫర్ అంటే చాలు ఇండియా అయినా ఇంకేదేశమైనా ఇలాగే మారిపోతుందంటూ రాసుకొచ్చారు.

# పింఛన్‌లు తీసుకునేవారికి భారీ ఊరట..




**ఆంధ్రప్రదేశ్:** పింఛన్ల తొలగింపుపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం ఖండించింది. అర్హులైన 65 లక్షల మందికి పింఛన్లు అందుతున్నాయని, ఎటువంటి రద్దులు జరగలేదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో నకిలీ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందిన అనర్హులకు మాత్రమే నోటీసులు జారీ చేశామని, అర్హులైన దివ్యాంగులను వృద్ధాప్య పింఛన్‌లోకి మారుస్తున్నామని తెలిపారు. తొలగింపు నోటీసులు పొందినవారు సరైన పత్రాలు చూపి పింఛన్‌ను తిరిగి పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల రద్దు చేస్తామంటూ అనర్హులుగా తేలినవారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో పింఛన్‌ల తొలగింపు అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా స్పందించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరి పింఛన్ తొలగించబోమన్నారు. తాజాగా పింఛన్ల తొలగింపు అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ క్లారిటీ ఇచ్చారు. పింఛన్ల తొలగింపు ఆరోపణలు అవాస్తవమని.. కూటమి ప్రభుత్వం 15 నెలల్లో ఒక్క పింఛన్ కూడా రద్దు చేయలేదన్నారు. ఏపీలో రాష్ట్రవ్యాప్తంగా 63.71 లక్షల మందికి పింఛన్లు మంజూరు చేస్తుంటే.. ఏడాదికి పింఛన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చనిపోయిన వారి పింఛన్లు మాత్రమే తొలగిస్తున్నామని.. రాష్ట్రంలో 80 వేల మంది అనర్హులు ఉన్నట్లు తేలిందన్నారు. పింఛన్ల తొలగింపుపై ఆధారాలు ఉంటే చూపించాలని ఛాలెంజ్ చేశారు. పింఛన్ల విషయంలో ప్రభుత్వం విధానాలు స్పష్టంగా ఉన్నాయన్నారు.

ప్రభుత్వం ప్రజల్ని పేదరికం నుంచి ప్రజలను బయటకు తీసుకురావడానికి పింఛన్లు అందిస్తోంది.. వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటున్న చాలా మంది సంతోషంగా ఉన్నారన్నారు మంత్రి. భర్త చనిపోతే భార్యకు కూడా ఆ తర్వాత నెల నుంచి పింఛన్ మంజూరు చేస్తున్నామని గుర్తు చేశారు. అదే సందర్భంలో అనర్హులకు పింఛన్లు రావన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో కొందరు నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగుల కేటగిరిలో పింఛన్ తీసుకున్నారని వివరించారు. ఆ కారణంగా అనర్హులుగా ఉన్నవారికి మాత్రమే నోటీసులు ఇచ్చామన్నారు. అర్హులైన దివ్యాంగులు ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలని రాష్ట్ర ముఖ్యమం త్రి అధికారులను ఆదేశించారన్నారు.

గత 9 నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల తనిఖీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్. ఇప్పటివరకు 7 లక్షల 95 వేల మంది పెన్షన్ తనిఖీలు పూర్తయ్యాయన్నారు. దివ్యాంగుల కోటాలో ఉన్నవారిలో అర్హులైన కొందరిని వృద్ధాప్య పింఛన్‌లోకి మారుస్తున్నామన్నారు. హెల్త్ పింఛన్ కోసం ప్రభుత్వ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి తనిఖీ చేస్తారన్నారు. 20 వేల మంది డిసేబుల్డ్ లిస్టులోకి వెళ్లారని.. వారిలో అర్హత ఉన్నవారందరికి వృద్ధాప్య పింఛన్‌లోకి మారుస్తామన్నారు. ఒకవేళ పింఛన్ తొలగింపుపై నోటీసులు ఇచ్చినా సరే.. సరైన సర్టిఫికెట్లు చూపిస్తే పింఛన్ తిరిగి మంజూరు చేస్తామన్నారు. అర్హులైన వారికే పెన్షన్ ఇవ్వాలనేది ప్రభుత్వ విధానమన్నారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్. పింఛన్లు అకారణంగా తొలగిస్తున్నారనే ప్రచారం చేయడం సరికాదన్నారు. పింఛన్ల రద్దుపై నోటీసులు ఇచ్చినా సరే.. అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చామని గుర్తు చేశారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్.



## నెలకు రూ.400కే 9 ఓటీటీలు, వారికి జస్ట్ రూ.140 మాత్రమే

**ఆంధ్రప్రదేశ్:** ప్రజలకు శుభవార్త తెలిపింది. అమరావతి లో సేవలను విస్తరిస్తామని, త్వరలో టవర్లు ఏర్పాటు చేస్తామని ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం వెల్లడించారు. నెలకు రూ.400లకే ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చామని, ఇందులో ఇంటర్నెట్, టీవీ, ఫోన్ సదుపాయాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

రాబోయే మూడు నెలల్లో 5సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అమరావతిలో సేవలను విస్తరిస్తామని బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం చెప్పారు. అమరావతిలో త్వరలో టవర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఏపీ సర్కిల్‌లో నెలకు రూ.400లకే ఫైబర్ టీవీ బేసిక్ ప్లాన్ తెచ్చామని ప్రకటించారు. ఈ ప్లాన్‌లో ఇంటర్నెట్, టీవీ, ఫోన్ సదుపాయాలు ఉంటాయని.. రాబోయే మూడు నెలల్లో సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఆయన కీలక ప్రకటన చేశారు. రాజధాని అమరావతిలో బీఎస్ఎన్ఎల్ సేవల్ని మెరుగుపరిచేందుకు త్వరలోనే టవర్లు ఏర్పాటు చేస్తామన్నారు శేషాచలం.

బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్‌లో నెలకు రూ.400లకే వినియోగదారుల కోసం కొత్త ప్లాన్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ ప్లాన్‌లో 400కు పైగా ఛానళ్లు, తొమ్మిదికి పైగా ఓటీటీలు ఉన్నాయని.. దేశవ్యాప్తంగా అపరిమిత కాల్స్ చేసుకోవచ్చన్నారు. 20 ఎంబీపీఎస్ ఇంటర్నెట్ వేగం కూడా లభిస్తుందని.. ఎఫ్‌టీటీహెచ్ వినియోగదారులు కేవలం రూ.140 చెల్లించి ఈ సేవలు పొందవచ్చన్నారు. ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులు చాలా ప్రయోజనాలు పొందవచ్చంటున్నారు. ఏవైనా ఈ ప్లాన్ కావాలనుకుంటే ఆన్‌లైన్ ద్వారా లేదా సమీపంలోని సర్వీస్ సెంటర్లను సంప్రదించి పొందవచ్చ న్నారు. లోకల్ కేబుల్ ఆపరేటర్లు టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పార్టనర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ ప్లాన్ గురించి అవగాహన కల్పించేందుకు మేళాలు నిర్వహిస్తామన్నారు. ఇటీవల ప్రకటించిన ఫ్రీడమ్ ప్లాన్‌కు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. వినియోగదారుల సంఖ్య మూడు రెట్లు పెరిగిందని తెలిపారు. అంత్యోదయ మిషన్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 1,380 టవర్లను అప్‌డేట్ చేస్తున్నట్లు శేషాచలం తెలిపారు.

# ముసుగు తొలగిపోయింది..

### ప్రజలకు ద్రోహం చేశారు..




**ఆంధ్రప్రదేశ్:** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థికి వైఎస్సార్‌సీపీ మద్దతు తెలపడం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దుమారం రేపుతోంది. కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల తీవ్రంగా స్పందిస్తూ వైఎస్సార్‌సీపీ బీజేపీకి బీ–టీమ్ అని విమర్శిం చారు. అవినీతి కేసుల భయంతోనే జగన్ బీజేపీకి దాసోహం అయ్యారని ఆరోపించారు. బొత్స సత్యనారాయణ మాత్రం రాజ్యాంగ పదవుల విషయంలో తమ విధానం వేరని సమర్థించుకున్నారు. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి. వైఎస్సార్‌సీపీ తాజాగా తీసుకున్న నిర్ణయం ఆసక్తికరంగా మారింది. ఆ పార్టీ తీసుకున్న స్టాండ్‌పై విమర్శలు వస్తున్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ఎన్డీఏ తరఫున పోటీలో ఉన్న రాధాకృష్ణన్‌కు మద్దతు తెలిపింది. ఈ విషయాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తెలియజేశారు. అయితే వైఎస్సార్‌సీపీ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఆ పార్టీ ముసుగు తొలగించింది.. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అంటూ ఘాటుగా ట్వీట్ చేశారు.

'వైఎస్సార్‌సీపీ ముసుగు మళ్లీ తొలగింది. లోనున్న కాషాయ కండువా మరోసారి బయటపడింది. బీజేపీకి బీ–టీం అని నిజ నిర్ధారణ జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ గారికి దత్తపుత్రుడే అని రాష్ట్ర ప్రజలకు కుండబద్దలు కొట్టినట్లు అర్థం అయ్యింది. ఈ రాష్ట్రంలో ప్రతిపక్షం ముసుగులో ఉన్నది మోదీ గారి పక్షమేనని తేటతెల్లమైంది. బీజేపీ కోసమే పనిచేసే పక్షమేనని రుజువైంది. బీజేపీకి ఊడిగం చేసే బానిసలే. టీడీపీ, జనసేన పార్టీలది తెరమీద పొత్తు. వైఎస్సార్‌సీపీది తెరవెనుక అక్రమ పొత్తు.. వైఎస్సార్‌సీపీతీరు రాష్ట్రంలో కూటమి పక్షాలతో కుస్తీ. ఢిల్లీలో మతపిచ్చి బీజేపీతో దోస్తీ' అంటూ షర్మిల ఘాటుగా స్పందించారు. 'ఉపరాష్ట్రపతి ఎన్నికలో కూటమి నిలబెట్టిన బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వడానికి వైఎస్సార్‌సీపీకి సిగ్గుండాలి. అవినీతి కేసులకు భయపడి బీజేపీకి మళ్లీ దాసోహం అన్నారు. 5 ఏళ్లు దోచుకుతిన్నది దాచుకోడానికి బీజేపీకి జై కొట్టారు. ఈ దేశంలో ఓట్ చోరితో రాజ్యాంగం ఖూనీ అయ్యేది వైఎస్సార్‌సీపీకి కనిపించదు. మోదీ గారు ప్రజాస్వామ్యం అపహాస్యం చేస్తుంటే విమర్శించడానికి వైఎస్సార్‌సీపీకి నోరు పెకలదు. మణిపూర్, గోద్రా అల్లర్లలో చేస్తున్న రక్తపాతం మీద మౌనం వహిస్తారు. మోదీ గారి అక్రమాలు బయటపెట్టే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారి గురించి మాత్రం ఉవ్వెత్తున లేస్తారు. మోదీ గారికి ఆపద వచ్చిందని అండగా నిలబడతారు. ఈ దేశ ప్రతిపక్షాలన్నీ కలిసి రాజకీయాలతో సంబంధం లేని ఒక తెలుగు బిడ్డ, న్యాయ నిపుణుడిని నిలబెడితే, బీజేపీ నిలబెట్టిన వాడికి మద్దతు ఇస్తారా ? ఇది తెలుగు ప్రజలకు చేసిన ద్రోహం కాకపోతే మరేంటి ? దీనిపై రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమాధానం చెప్పాలి' అంటూ ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ పార్టీ రాజ్యాంగ పదవుల విషయంలో ఒక విధానాన్ని అనుసరిస్తోందన్నారు బొత్స సత్యనారాయణ. ఆ పదవులకు నెంబర్ గేమ్ ఉండకూడదని భావిస్తున్నామని.. పార్టీ ఆవిర్భావం నుంచి ఇదే విధానాన్ని కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. గతంలో ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా ఉన్నప్పుడు జగన్ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇస్తామన్నారు. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి కూడా దక్షిణాదికి చెందినవారేనని.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభ్యర్థనను పరిగణలోకి తీసుకోలేమన్నారు బొత్స సత్యనారాయణ.

# కొత్త క్రికెట్ స్టేడియాలు..

**అమరావతి:** కొత్త క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వడివడిగా అడుగులు వేస్తోంది. 60 వేల సీటింగ్ సామర్థ్యంతో స్టేడియం నిర్మించను న్నారు. అమరావతి స్టేడియాన్ని మళ్లీ ఈవెంట్ స్టేడియం గా తీర్చిదిద్దనున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సానా సతీష్ వెల్లడించారు. రాష్ట్రంలో తొలి విడతలో మూడు చోట్ల క్రికెట్ స్టేడియాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అమరావతిలో నిర్మించే క్రికెట్ స్టేడియం దేశంలోని అతిపెద్ద క్రికెట్ స్టేడియాలలో ఒకటిగా నిలవనుంది. ఆ దిశగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా అమరావతిలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి 40 ఎకరాల భూమి కేటాయించాలని ఏసీఏ ఇప్పటికే ఏపీ ప్రభుత్వాన్ని కోరింది.

అమరావతిలో నిర్మించే క్రికెట్ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తామని.. దేశం లోని అత్యుత్తమ క్రికెట్ మైదానాలలో ఒకటిగా తీర్చి దిద్ది, ఎక్కువ అంతర్జాతీయ మ్యాచ్‌లు జరిగేలా చూస్తామని ఏసీఏ సెక్రటరీ, ఎంపీ సానా సతీష్ వెల్లడించారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం నిర్మించడానికి కనీసం రూ.300 కోట్లు అవసరం అవుతుందని సానా సతీష్ అంచనా వేశారు.

అమరావతి క్రికెట్ స్టేడియంతో పాటుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో క్రికెట్ స్టేడియాలు నిర్మించనున్నట్లు ఏసీఏ సెక్రటరీ సానా సతీష్ వివరించారు. ప్రస్తుతం మంగళగిరి, మూలపాడు (విజయవాడ), విజయనగరం, విశాఖపట్నం, అనంతపురంలో క్రికెట్ స్టేడియాలు ఉన్నట్లు ఆయన వివరించారు. తొలి విడతలో తిరుపతి, నెల్లూరు, కర్నూలులో పెద్ద స్టేడియాలు నిర్మించనున్నట్లు టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు. ఈ మూడు చోట్ల ఇప్పటికే భూ సేకరణ పూర్తైందని వివరించారు. వచ్చే మూడేళ్లల్లోగా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో క్రికెట్ మైదానాలను అభివృద్ధి చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ వెల్లడించారు. 60 వేల సీట్ల సామర్థ్యంతో దీనిని నిర్మించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. విశాఖపట్నం క్రికెట్ స్టేడియం 17 ఏళ్ల నాటిదని.. అందులో కనీస సౌకర్యాలు కూడా దెబ్బతింటే.. మూడు నెలల్లో మరమ్మత్తులు చేసినట్లు గుర్తు చేశారు. మరోవైపు విజయనగరం, అనంతపురం, మూలపాడులో అకాడమీలు నెలకొల్పనున్నట్లు వెల్లడించారు. ప్రతి అకాడమీలోనూ 40 నుంచి 50 మంది ప్లేయర్లకు ట్రైనింగ్ ఇచ్చేలా సౌకర్యాలు, ట్రైనర్లు, కోచ్‌లు, ఫిజియోలను అందుబాటులో ఉంచుతామని వివరించారు.



# డీజిల్, కరెంట్ ఖర్చు లేకుండా..



డీజిల్ ధరలు పెరగడంతో ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసిన డ్రైవర్లకు కరెంట్ బిల్లులు భారంగా మారాయి. అయితే, కాకినాడ జిల్లాకు చెందిన భాస్కరరావు అనే ఆటో డ్రైవర్ ఈ సమస్యకు వినూత్న పరిష్కారం కనుగొన్నారు. తన ఆటోకు సోలార్ ప్యానెల్స్ అమర్చి, కరెంట్ బిల్లుల బాధను తప్పించు కున్నారు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 8 గంటల పాటు ఆటో నడుస్తుందని ఆయన తెలిపారు.

కాలం మారింది, టెక్నాలజీ పెరిగింది.. డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చేస్తున్నాయి. కాలుష్యానికి చెక్ పెట్టడంతో పాటుగా డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో అందరూ ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు కూడా అదే బాటలో నడుస్తు న్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసిన కొందరు ఆటో డ్రైవర్లకు ఇప్పుడు మరో సమస్య వచ్చిపడింది. డీజిల్ ఖర్చు తగ్గుతుందని ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేస్తే.. ఇప్పుడు కరెంట్ బిల్లుల మోత మోగుతోందట. ఆటోకు ఛార్జింగ్ పెడితే కరెంట్ బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. అయితే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్ మాత్రం ఈ సమస్యకు చెక్ పెట్టారు.. స్మార్ట్‌గా ఆలోచించి కరెంట్ బిల్లుల ఖర్చు లేకుండా కొత్తగా ప్లాన్ చేశారు.

కాకినాడ జిల్లాలోని అచ్యుతాపురానికి భాస్కరరావు ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నారు. అయితే ఆటోకు డీజిల్ ఖర్చు పెరుగుతోందని భావించి.. మూడు నెలల కిందట ఈ–ఆటోను (ఎలక్ట్రిక్ ఆటో) కొనుగోలు చేశారు. ఆయన ఈ ఆటోను నెల తిప్పగానే.. ఛార్జింగ్ దెబ్బకు కరెంట్ బిల్లు మోత మోగిందట. డీజిల్ ఖర్చు తగ్గుతుందని ఈ–ఆటోను కొనుగోలు చేస్తే కరెంట్ బిల్లు రూపంలో పెద్ద సమస్య వచ్చి పడిందని ఆలోచించారట భాస్కర్‌రావు.. అప్పుడు ఆయనకు ఓ ఐడియా వచ్చింది. కరెంట్ బిల్లు ఖర్చు తగ్గించుకునేందుకు సోలార్ ప్లాన్ చేశారు. తన స్నేహితుడు ఒకరు సోలార్ టెక్నీషియన్‌గా ఉన్నారు.. ఆయన సాయం కోరారు. వెంటనే పిలిచి ఆటో పైభాగాన 48 ఓల్ట్స్, 580 వాట్స్ ఉన్న సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. ఈ ఆటోను సోలార్ ఆటోగా మార్చేశారు. ఈ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయడానికి రూ.30 వేల ఖర్చు అయ్యిందట.. ఒక్కసారి ఆటోపై ఉన్నసోలార్ ప్యానల్స్‌తో ఛార్జింగ్ చేస్తే చాలు.. ఏకంగా 8 గంటలపాటు ఆటో నిరంతరాయంగా ప్రయాణించవచ్చట. కరెంట్ బిల్లుల బాధ తప్పిందంటున్నారు.. అయితే వర్షాలు పడే సమయంలో మాత్రం ఇంట్లో ఛార్జింగ్ పెడతానని ఆయన అంటున్నారు. భాస్కరరావు వినూత్నంగా ఆలోచించి ఖర్చుల్ని తగ్గించుకోవచ్చు అని నిరూపిం చారు.. ఆటో డ్రైవర్లకు కొత్త ఐడియా ఇచ్చారు.

# 12 నగరాల్లో భూముల ధరలకు రెక్కలు!

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాల చుట్టూ కొత్తగా థీమ్ బేస్డ్ పట్టణాలు, టౌన్‌షిప్‌లు, సిటీస్ నిర్మించాలని ఆలోచన చేస్తోంది. నగరాల్లో జనాభా పెరుగుతుండ టంతో.. అందుకు తగిన విధంగా ముందే అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. నీతి ఆయోగ్ ఎంపిక చేసిన గ్రోత్ సిటీల్లో విశాఖప ట్నంలో ప్రత్యేకమైన పట్టణాలను నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వెయ్యి ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఈ విధానాన్ని ఇతర నగరాల్లో కూడా అమలు చేస్తారు.

ప్రభుత్వ, ప్రైవేట్ భూములను అధికారులు గుర్తించారు. అక్కడ ఏ సౌకర్యాలు కావాలో APUIAML సంస్థ పరిశీలిస్తోంది. "థీమ్ బేస్డ్" ఒక్కో పట్టణం ఒక్కో ప్రత్యేకతతో అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల నగరాల్లో జనాభా ఒత్తిడి తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ప్రజలకు అన్ని వసతులు అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యం. అనకాపల్లి, విజయనగరం ప్రాంతాల్లో "థీమ్ బేస్డ్" పట్టణాలను, సిటీలను, టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయనున్నారు. వైద్యం, పర్యాటకం వంటి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్ సంస్థలను ఆహ్వానిస్తారు. విశాఖపట్నం జనాభా ప్రస్తుతం 21 లక్షలు దాటింది.. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉంది. అందుకే చుట్టుపక్కల ప్రాంతాల్లో కొత్త పట్టణాలు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, జిల్లాల్లో 1,000 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించారు. భూసమీకరణ పథకం ద్వారా ప్రైవేట్ భూములు సమీకరిస్తారు. అప్పుడు ఈ భూమి యజమానులకు నష్టపరిహారం అందిస్తారు.

"థీమ్ బేస్డ్" పట్టణాలలో అన్ని సౌకర్యాలు ఉంటాయి. వైద్యం, పర్యాటకం, వినోదం, వాణిజ్యం, పరిశ్రమలు వంటి విభిన్న రంగాల్లో అభివృద్ధి జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వం ఆహ్వానం పలుకుతోంది. తద్వారా స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయి. ప్రాంతం కూడా అభివృద్ధి చెందు తుంది. విజయవాడ, గుంటూరుతో సహా 12 నగరాల్లో థీమ్ ఆధారిత పట్టణాల నిర్మాణం కోసం భూములు సిద్ధం చేస్తున్నారు. దాదాపు 1,500 ఎకరాల భూమిని గుర్తించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కలుపుకొని ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు. తొలి దశలో కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో ప్రణాళికలు సిద్ధం చేస్తారు. ఈ నగరాలకు అనుబంధంగా థీమ్ బేస్డ్ పట్టణాలు నిర్మిస్తారు. దీని కోసం ల్యాండ్ బ్యాంకును ఏర్పాటు చేస్తున్నారు. నిధుల కోసం పట్టణాభివృద్ధి సంస్థలు లేఔట్లు వేసి స్థలాలు అమ్ముతారు. నీతి ఆయోగ్ సిఫార్సులతో 'అర్బన్ ఛాలెంజింగ్ ఫండ్' కోసం రాష్ట్ర అధికారులు కేంద్రంతో చర్చలు జరుపుతున్నారు. కేంద్రం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లు కేటాయించింది.

# ఏకంగా రూ.9వేలకోట్లు పెట్టుబడులు..

**ఆంధ్రప్రదేశ్:** పోర్టు లాజిస్టిక్స్ రంగం అభివృద్ధికి భారీ పెట్టుబడులు రానున్నాయి. డెన్మార్క్‌కు చెందిన ఏపీఎం టెర్మినల్ సంస్థ రాష్ట్రంలోని రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల అభివృద్ధికి రూ.9 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఒప్పందం కుదిరింది. దీని ద్వారా 10 వేల మందికి ఉపాధి లభించనుంది. ఈ పెట్టుబడులతో రాష్ట్రంలో పోర్టుల ఆధునీకరణ జరగనుంది.



ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి పెట్టుబడులు వచ్చాయి.. పోర్టు లాజిస్టిక్స్ రంగంలో రూ.9 వేల కోట్ల పెట్టుబడి వచ్చింది. రాష్ట్రంలో రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల అభివృద్ధికి డెన్మార్క్‌కు చెందిన ఏపీఎం ( ఏపీ 'మోలర్–మేర్స్క్') టెర్మినల్ సంస్థ ఆసక్తి చూపిస్తోంది. పోర్టుల నిర్వహణ, లాజిస్టిక్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ సంస్థ ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఏపీ మారిటైం బోర్డుతో ఎంవోయూ కుదుర్చుకుంది. దీని ద్వారా రాష్ట్రంలో రూ.9 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. అలాగే 10 వేల మందికి ఉపాధి లభిస్తుందని సంస్థ తెలిపింది.

ఏపీఎం టెర్మినల్ సంస్థ పలు దేశాల్లో పోర్టు ఆధారిత సదుపాయాలు నిర్వహిస్తోంది. ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్‌లను కూడా చూసుకుంటోంది. మన రాష్ట్రంలోని ఓడరేవుల్లో ఆధునిక టెర్మినల్స్ ఏర్పాటు చేయనుంది. కార్గో హ్యాండ్లింగ్ వ్యవస్థలను కూడా అభివృద్ధి చేయనుంది. దీనికోసం దశలవారీగా రూ.9 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సంస్థ తెలిపింది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయంటున్నారు.

రాష్ట్రంలో పోర్టు లాజిస్టిక్ కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు. అప్పటి నుండి అధికారులు సంస్థతో సంప్రదింపులు జరుపుతున్నారు. దీంతో ఆ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అంగీకరించింది. దీర్ఘకాలిక పెట్టుబడులపై ఫీజిబులిటీ అధ్యయనం కోసం ఏపీ మారిటైం బోర్డుతో కలిసి పని చేస్తోంది. పెట్టుబడులపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ఒక జాయింట్ టీమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఏపీ మారిటైం బోర్డు, ఏపీఎం సంస్థ తరఫున ఇద్దరేసి సభ్యులతో ఒక బృందం పెట్టుబడి వ్యూహాలను రూపొందిస్తుంది. ఈ బృందం స్వల్పకాలిక, దీర్ఘకాలిక పెట్టుబడి ప్రణాళికలను సిద్ధం చేస్తుంది. ఏపీఎం సంస్థ ప్రపంచవ్యాప్తంగా పోర్టుల ద్వారా సప్లై చైన్‌ను అభివృద్ధి చేస్తోంది. 130కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. లక్ష మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. ప్రస్తుతం గుజరాత్‌లోని పిపావావ్, ముంబయిలోని గేట్‌వే టెర్మినల్ పోర్టులలో కార్యాకలాపాలు నిర్వహిస్తోంది.

# రాత్రికి రాత్రే మారిపోయిన దశ..

**కర్నూలు:** 300 రూపాయల కూలీ పనికి వెళితే.. 40 లక్షల రూపాయల వజ్రం లభించింది. అలా ఒక్కరోజులోనే ఒక్క వజ్రంతో.. ఆ మహిళ లక్షాధికారి అయ్యింది. ఒక రోజులో కూలీగా ఉన్న మహిళను కొన్ని లక్షలు వరించాయి. అదృష్టం ఎవరిని ఎప్పుడు ఎలా వరిస్తుందో చెప్పడానికి ఇదే నిదర్శనం. దాదాపు 15 రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వజ్రాల వేటగాళ్లు.. వారి అన్వేషణను మరింత వేగవంతం చేశారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరిలో ఓ మహిళ పంట పొలంలో పచ్చి మిర్చి పంటకు సంబంధించిన కలుపు పనులు చేస్తుంది. అయితే, దూరం నుంచి ఆ మహిళకు ఓ మెరుస్తున్న వస్తువు ఒకటి కన్పించింది. దగ్గరికి తీసుకుని చూస్తే అది బాగా మెరుస్తోంది. డౌట్ వచ్చి దానిని ఒక వజ్రాల వ్యాపారికి చూపించడంతో.. అసలు విషయం బయటపడింది. అదొక అరుదైన వజ్రం అని ఆయన చెప్పాడు. వెంటనే ఆయన దానిని 40 లక్షల నగదు ఇచ్చి కొనుగోలు చేశాడు. అయితే బహిరంగ మార్కెట్లో ఈ వజ్రం విలువ ఇంకా ఖరీదైనదిగా తెలుస్తోంది. దొరికిన వజ్రం విలువ ఎంత చేస్తుంది అన్న అవగాహన లేక దొరికిన వజ్రాన్ని తక్కువ ధరకే అమ్మేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



# నిరుద్యోగులకు శుభవార్త..

## 1,623 ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్

**తెలంగాణ:** నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. వైద్య శాఖలో భారీగా 1623 పోస్టుల భర్తీకి సిద్ధమైంది. త్వరలోనే దీనికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈభర్తీ ప్రక్రియలో స్పెషలిస్ట్ డాక్టర్ల నియామకాన్ని పూర్తి చేయనుంది. వైద్య శాఖలో ఉద్యోగాల భర్తీ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. దీనిపై హర్షం వ్యక్తం చేయడమే కాక.. మరిన్ని శాఖల్లోనూ ఉద్యోగాల భర్తీకి నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

తెలంగాణలోని నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. త్వరలోనే 1,623 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన వారిలో నిరుద్యోగులు ముందు వరుసలో ఉంటారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో లోపాలు, పేపర్ లీకేజీ వంటి ఘటనలు నిరుద్యోగుల్లో తీవ్ర ఆగ్రహాన్ని మిగిల్చాయి. ఈక్రమంలో వారు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతిచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ సర్కార్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో జాప్యం చేస్తూ వస్తోంది. దీనిపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈక్రమంలో తాజాగా రేవంత్ సర్కార్ శుభవార్త చెప్పింది. ఆ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి సిద్ధమవుతోంది. ఆ వివరాలు..

తెలంగాణ సర్కార్ వైద్య శాఖలో ఉద్యోగాల భర్తీకి రెడీ అవుతోంది. ఇప్పటికే వైద్య శాఖలో వివిధ విభాగాల్లో భారీ ఎత్తున ఉద్యోగాలను భర్తీ చేసి గ్రామీణ వైద్యానికి పెద్ద పీట వేస్తోన్న రేవంత్ సర్కార్.. తాజాగా మరో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రెడీ అవుతోంది. ఈ క్రమంలో వైద్య చరిత్రలోనే భారీ సంఖ్యలో స్పెషలిస్ట్ వైద్యుల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం రెడీ అవుతోంది. దీనిలో భాగంగా 1,623 స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టులకు నోటిఫికేషన్ సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి విధివిధానాలు పూర్తి చేసి నోటిఫికేషన్ విడుదల చేయాలని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డును ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. దీంతో ఒకటి రెండు రోజుల్లో నోటిఫికేషన్ విడుదల కానుంది అంటున్నారు. వైద్య శాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీతో జిల్లా, ఏరియా ఆసుపత్రులతోపాటు కమ్యూనిటీ సెంటర్లలో వైద్య సేవలు మెరుగు పడనున్నాయి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య శాఖలో సుమారు 8 వేల పోస్టులని భర్తీ చేసిన ప్రభుత్వం... త్వరలోనే మరో 7 వేల పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేస్తోంది. ప్రభుత్వం భర్తీ చేయబోయే ఉద్యోగాల వివరాలను గమనిస్తే..

- 2322 స్టాఫ్ నర్స్
- 1284 ల్యాబ్ టెక్నీషియన్
- 732 ఫార్మసిస్ట్
- 1931 ఎంపీహెచ్ఎస్ ఫీమేల్
- 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్
- 4 స్పీచ్ పాథాలజిస్ట్
- 607 అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఉన్నాయి...

అయితే తాజాగా వీటిల్లో పలు పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిషికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ లిస్ట్‌లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులుండగా.. మరో 48 డెంటల్ అసిస్టెంట్ సర్జన్.. పోస్టులు.. 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇదే తరహాలో వైద్య శాఖలో ఖాళీగా ఉన్న మిగతా పోస్టులను కూడా భర్తీ.. చేసి వైద్య సేవలను మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలానే మిగతా శాఖల్లో కూడా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

# మీకు కావాల్సిన బైక్ తక్కువ ధరలో కొనుక్కోవచ్చు..

**కామారెడ్డి:** సంత లేదా అంగడి అనగానే మనకు మొదట గుర్తుకు వచ్చేది కూరగాయలు. వీటిని ఎక్కువగా సంతలో అమ్ముతుంటారు. వీటి తర్వాత పశువుల సంత అనేది మనం విని ఉంటాము. ఈ సంతలో ప్రతీ వారం ఒక రోజు చొప్పున నిర్వహిస్తుంటారు. కూరగాయలు, పశువులు, మేకలు లాంటి సంతలను ఇప్పటి వరకు మనం చూశాము.. విన్నాము. కానీ కామారెడ్డి జిల్లాలో గత ఆరు సంవత్సరాల నుంచి ఇక్కడ ప్రతీ గురువారం ఓ విచిత్రమైన సంతను నిర్వహిస్తున్నారు. అదే బైక్‌ల సంత. ఇది విన్నవారికి.. చూసిన వారికి ఎంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సీఎస్ఐ చర్చి మైదానంలో జరుగుతున్న ఈ అంగడిలో వివిధ గ్రామాల నుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు హాజరవుతారు.

ఇక్కడ అమ్మకానికి వచ్చే ద్విచక్ర వాహనాలను ముందుగా నిర్వాహకులు పత్రాలు పరిశీలించి.. అన్నీ చట్టబద్ధంగా ఉన్నాయో లేదో ధృవీకరించాకే మార్కెట్‌లో ఉంచుతారు. దీనికోసం వాహన యజమానుల నుండి కేవలం రూ.50 ఫీజు వసూలు చేస్తారు. ఈ ప్రక్రియతో వినియోగదారులు నమ్మకంగా వాహనాలను కొనుగోలు చేసే అవకాశం పొందుతున్నారు. ధరపై చర్చించి ఇష్టమైన బైక్‌ను సొంతం చేసుకోవడం ఇక్కడి ప్రత్యేకత.

నిర్వాహకుడు ప్రతి ట్రాన్సాక్షన్‌పై స్వల్ప కమీషన్ తీసుకుంటారు. దీని వల్ల మార్కెట్ క్రమపద్ధతిలో కొనసాగుతుంది. ప్రతీ వారమూ 40 నుండి 50 బైక్‌లు ఇక్కడ అమ్ముడవుతుంటాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి రైతులు, కార్మికులు తక్కువ ధరలో వాహనం కొనుగోలు చేసేందుకు ఈ బైక్ బజార్‌ను ఆశ్రయిస్తున్నారు. కొత్త బైక్‌లు కొనలేని యువత కూడా ఇక్కడి ద్విచక్ర వాహనాలను ఎంచుకుంటున్నారు. ఈ సంతతో స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తోంది. పాత వాహనాల విక్రయం మాత్రమే కాకుండా.. అక్కడే ఉన్న టీ దుకాణాలు, ఫుడ్ స్టాళ్లు కూడా ఆదాయం పొందుతున్నాయి. కొనుగోలుదారులు ఒకచోట అనేక వాహనాలను చూసి పోల్చుకునే అవకాశం కలిగించడం ఈ మార్కెట్ ప్రత్యేకత. అంటే వివిధ రకాలు కంపెనీల బైక్స్ ఒకే దగ్గర దర్శనం ఇవ్వడంతో వినియోగదారుడు తనకు నచ్చిన బైక్స్ కొనుగోలు చేయవచ్చు.

# ప్రయాణికులకు బంపర్ ఆఫర్ ప్రకటించిన ఆర్టీసీ ..

**తెలంగాణ:** ఆర్టీసీ ప్రయాణికుల కోసం మరో బంపర్ ఆఫర్ ప్రకటించింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులకు ఈ ఆఫర్ వర్తించనుంది. వీటిలో ప్రయాణించే వారికి టికెట్ పై 26 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇది కేవలం ఈ గరుడ వాహనాల్లో మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. ఇటీవల టీ 24 టికెట్స్‌పై ఫ్రీడం ఆఫర్ ప్రకటించిన ఆర్టీసీ.. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

తెలంగాణ స్టేట్ రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులకు కొత్త బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ మార్గంలో నడుస్తున్న ఈ-గరుడ ఎలక్ట్రిక్ బస్సుల్లో టికెట్ ధరపై 26 శాతం రాయితీని అందజేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఇప్పటికే అమల్లోకి రావడంతో ప్రయాణికులు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణాన్ని ఆస్వాదించే అవకాశం లభించింది.



**ఈ-గరుడ బస్సుల ప్రత్యేకతలు..**

ఈ-గరుడ బస్సులు ఆధునిక సాంకేతికతతో రూపకల్పన చేయబడ్డాయి. ఇవి పూర్తిగా కాలుష్య రహిత ఎలక్ట్రిక్ బస్సులు కావడంతో పర్యావరణానికి మేలు చేస్తాయి. సాధారణ డీజిల్ బస్సులతో పోలిస్తే ఈ బస్సుల్లో ప్రయాణం మరింత హాయిగా.. సౌకర్యవంతంగా ఉంటుంది. వీటిలో 100 శాతం సౌకర్యం కలిగిన ఎయిర్ కండీషనింగ్ సదుపాయం ఉంది. విశాలమైన సీటింగ్, ఆధునిక రిక్లైనింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో USB ఛార్జింగ్ పాయింట్లు, మొబైల్ హోల్డర్లు, ప్యానోరమిక్ గ్లాస్ విండోస్, ఎర్గోనామిక్ డిజైన్ వంటి సౌకర్యాలు కలవు. ఈ ప్రయాణానికి ప్రతిరోజూ వందల సంఖ్యలో బస్సులను నడుపుతోంది. సాధారణ పల్లెవెలుగు నుంచి లగ్జరీ వోల్వో, ఈ-గరుడ వరకు అన్ని తరహాల సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల ఈ రూట్‌లో ప్రయాణికుల సంఖ్య పెరగడం దృష్ట్యా.. టికెట్ ధరల్లో పలు రకాల రాయితీలను ప్రకటించింది. వాటిలో సూపర్ లగ్జరీ బస్సుల్లో 10 శాతం రాయితీ, ఇంద్ర బస్సుల్లో 15 శాతం రాయితీ, వోల్వో/ఈ-గరుడ బస్సుల్లో 20 శాతం వరకు రాయితీ ఇది వరకే కల్పించగా.. తాజాగా ఈ కొత్త ఆఫర్లలో భాగంగా ఇప్పుడు ప్రత్యేకంగా ఈ-గరుడ బస్సులకు 26 శాతం తగ్గింపు ఇవ్వడం విశేషం.

**ఈ-గరుడ బస్సుల సంఖ్య, ప్రయాణ సమయం..**

ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ మార్గంలో 10 ఈ-గరుడ బస్సులు నడుస్తున్నాయి. ట్రాఫిక్ పరిస్థితులను బట్టి ప్రయాణ సమయం 5 గంటల నుంచి 5 గంటల 30 నిమిషాల మధ్య ఉంటుంది. హైదరాబాదులో మియాపూర్, మహాత్మా గాంధీ బస్ స్టేషన్, ఎల్‌బీ నగర్ నుంచి బస్సులు బయలుదేరుతుండగా, విజయవాడ బస్ స్టాండ్ వరకు చేరుకుంటాయి. భవిష్యత్తులో అన్ని ప్రధాన మార్గాల్లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెంచాలని నిర్ణయం తీసుకుంది. కాలుష్య రహిత రవాణా ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడడమే కాకుండా.. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందించడం సంస్థ ప్రధాన ఉద్దేశం. ఈ-గరుడ బస్సులు ఇప్పటి వరకు ప్రజల నుంచి విశేష స్పందన పొందాయి. ఇటీవల టీ24 టికెట్‌పై ఆర్టీసీ ఆఫర్ ప్రకటించిన సంగతలి తెలిసిందే.

# కొత్త రేషన్ కార్డు దారులకు భారీ శుభవార్త..

**తెలంగాణ:** ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు పండగ లాంటి వార్త చెప్పింది. ఒక్కటి కాదు రెండు కాదు ఒకేసారి మూడు శుభవార్తలు చెప్పింది. కొత్తగా రేషన్ కార్డు పొందిన వారికి సెప్టెంబర్ నుండి సన్న బియ్యం పంపిణీ చేయనుంది. దీంతో పాటుగా మరో వారం, పది రోజుల్లోగా వీరికి ఆరోగ్యశ్రీ పథకం కూడా వర్తింపచేయనుంది. సెప్టెంబర్ నుండి రేషన్ కార్డుదారులకు ఉచితంగా ప్రత్యేక రేషన్ బ్యాగులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ఎత్తున కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. జులై నెలలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ ప్రారంభించింది. ఈక్రమంలో రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి రేవంత్ సర్కార్ భారీ గుడ్‌న్యూస్ చెప్పింది. వారికి ఒకేసారి మూడు బొనాంజాలు ప్రకటించింది. దీని గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు కూడా జారీ చేశారు. ఇక మూడు బొనాంజాల విషయానికి వస్తే.. వీటిల్లో మొదటిది ఏంటంటే.. మూడు నెలల రేషన్ పంపిణీ తర్వాత.. సెప్టెంబర్ నుంచి మళ్లీ రేషన్ పంపిణీ మొదలు కానుంది.

దీనిలో భాగంగా సన్నబియ్యం ఇస్తున్నారు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి కూడా సెప్టెంబర్ నెలలో సన్నబియ్యం ఇవ్వనున్నారు. దీనితో పాటు వీరికి ఆరోగ్యశ్రీ పథకం కూడా వర్తించనుంది. దీని కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పాత రేషన్ కార్డు దారులతోపాటుగా కొత్తగా రేషన్ కార్డు పొందిన వారికి కూడా త్వరలోనే ఆరోగ్యశ్రీ వర్తించనుంది. మరో వారం గడిస్తే ఇది కొత్త వారికి కూడా అమల్లోకి వస్తుందని సమాచారం.

ప్రస్తుతం కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారి పేర్లు ఆరోగ్యశ్రీ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. వారం, పది రోజుల్లో ఈ పని పూర్తవుతుందని సమాచారం. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 461 ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు లభిస్తున్నాయి. కొత్తగా కార్డు పొందిన వారు సెప్టెంబర్ నెల నుంచి ఆరోగ్యశ్రీ సేవల్ని పొందేందుకు అర్హులవుతారు. దీని ద్వారా వీరికి 10 లక్షల రూపాయల మేర లబ్ధి చేకూరనుంది.

# మరో ఐదు రోజులు వర్షాలు..



**తెలంగాణ:** గత రెండు వారాలుగా ఎడతెరపి లేకుండా కురుస్తోన్న వానలకు రెండు రోజుల నుంచి కాస్త బ్రేక్ పడింది. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో వర్షాలు కాస్త తగ్గినట్టే అనిపించినా, వాతావరణ శాఖ మాత్రం మరో ఐదు రోజులు వానలు పడే అవకాశం ఉందని హెచ్చరిస్తోంది. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. నేడు రాష్ట్రంలో వాతావరణం పొడిగా ఉన్నప్పటికీ, ఆకాశం మేఘావృతమై ఉంటుందని సమాచారం. మరి ఈ వానలు ఎప్పుడు పూర్తిగా తగ్గుతాయో చూడాలి.


గత కొన్ని రోజులుగా కుండపోత వానలతో తడిసి ముద్దయిన రాష్ట్రం రెండు రోజుల నుంచి కాస్త ఊపిరి పీల్చుకుంటుంది. అల్పపీడనం ప్రభావం ముగిసిన తర్వాత వానలు తగ్గుముఖం పట్టాయి. అయితే వర్షాలు పూర్తిగా తగ్గాయా.. ఇప్పట్లో వానలు కురువవా.. శుక్రవారం నాడు వాతావరణం ఎలా ఉండబోతుంది అనే దానిపై వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. రెండు తెలుగు రాష్ట్రాలను వానలు ఇంకా వీడలేదని.. మరో 5 రోజులు వర్షాలు కురుస్తాయని.. అయితే రాష్ట్రం అంతా భారీ వర్షాలు కురిసే అవకాశం లేదని.. తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయని తెలిపింది.

ఇక శుక్రవారం రాష్ట్రంలో వాతావరణం విషయానికి వస్తే పొడి వాతావరణమే ఉంటుందని.. అయితే కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆకాశం మేఘావృతం అయి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలానే రుతుపవన ద్రోణి సముద్రం మట్టం నుంచి 1.5 కిమీ ఎత్తులో తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని వల్ల మరో ఐదు రోజులు అంటే ఆగస్టు 27 వరకు తెలంగాణ వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయని వెల్లడించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది.

నేడు అనగా శుక్రవారం నాడు తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీనిలో భాగంగా ఖమ్మం, కొత్తగూడెం, మంచిర్యాల, ములుగు, భూపాలపల్లి, సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కుడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అలానే ఈ జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక గత 24 గంటల్లో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జైనథ్‌లో అత్యధికంగా 2.95 సెం.మీ వర్షపాతం నమోదైంది. గత రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రం చిగురుటాకులా వణికిపోయింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యా జిల్లాల్లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకుని.. నిండుకుండలను తలపిస్తున్నాయి. అయితే వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు బాగా దెబ్బ తిన్నాయి. ప్రభుత్వం దీనిపై సమీక్షిస్తోంది. మరి కొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# తెలంగాణ బంద్‌కు పిలుపు..

**తెలంగాణ:** ఇటీవల కొన్ని ప్రాంతాల్లో 'మార్వాడీలు గో బ్యాక్' అంటూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక వ్యాపారులు, చిన్న కూలీ కార్మికులు తమ జీవనోపాధి క్షీణించిందని ఆరోపిస్తున్నారు. మార్వాడీ వ్యాపారులు పెద్ద ఎత్తున వ్యాపారాలు, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ రంగాల్లో పట్టు సాధించడంతో స్థానికులకు నష్టం జరుగుతుందని.. దీనిలో భాగంగానే రేపు తెలంగాణ బంద్‌కు ఓయూ జేఏసీ పిలుపుని చ్చింది. అయితే ఈ బంద్‌లో నల్గొండ, వరంగల్ జిల్లాలోని వ్యాపారులు పూర్తి మద్దతు పలికారు.



తెలంగాణలో గత కొన్ని రోజులుగా కొనసాగుతు న్న మార్వాడీ గో బ్యాక్ ఉద్యమం ఇప్పుడు మరింత ఉధృతమవుతోంది. ఈ ఉద్యమంలో భాగం గా.. వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు వ్యాపార సంస్థలు, వాణిజ్య సంఘాలు బంద్‌కు మద్దతు తెలుపుతూ తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయనున్నట్లు ప్రకటించాయి. ఓయూ జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపుకు అనేక వర్తక సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు మద్దతుగా నిలిచారు. స్థానిక వర్తకులపై, ప్రజలపై గుజరాత్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన మార్వాడీలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని వీరు ఆరోపిస్తున్నారు.

**బంద్‌కు ప్రధాన కారణాలు..**

ఈ తాజా బంద్ పిలుపునకు ముఖ్య కారణం.. మోండా మార్కెట్‌లో ఒక దళితుడిపై మార్వాడీ వర్తకులు దాడికి పాల్పడటమే. ఈ ఘటనను ఓయూ జేఏసీ ఛైర్మన్ కొత్తపల్లి తిరుపతి తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ఆంధ్ర పెత్తందారుల నుంచి బయటపడితే.. ఇప్పుడు మార్వాడీలు ఇక్కడి స్థానిక ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్నారని ఆయన విమర్శించారు. అంతేకాకుండా.. వారు స్థానికులపై దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 18వ తేదీన ఆమనగల్లు ప్రాంత వ్యాపారులు కూడా ఇదే సమస్యపై బంద్‌ను నిర్వహించారు.

## బంద్ జాబితాలోకి చేరిన ఆ రెండు జిల్లాలు..

**రాజకీయ కోణంలో ఉద్యమం..**

'మార్వాడీ గో బ్యాక్' అనే నినాదం ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఒక వివాదాస్పద అంశంగా మారింది. కొందరు ఈ ఉద్యమానికి మద్దతిస్తుండగా.. మరికొందరు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీకి చెందిన నాయకులు బండి సంజయ్, రాజా సింగ్ వంటి వారు మార్వాడీలకు అండగా నిలుస్తున్నారు. ఈ ఉద్యమం హిందూ సమాజాన్ని చీల్చేందుకు జరుగుతున్న కుట్ర అని బండి సంజయ్ ఆరోపించారు. ఒకవేళ 'మార్వాడీ గో బ్యాక్' అంటూ ప్రచారం చేస్తే.. తాము కూడా ఇతర వర్గాలవారు చేసే వ్యాపారాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రచారం రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలకు దారితీస్తోందని ఆయన పేర్కొన్నారు. మార్వాడీ వ్యాపారుల మధ్య సామరస్యాన్ని.. ఈ సమస్యను బంద్ లేదా నిరసనలతో పరిష్కరించడం కష్టమని నిపుణులు అభిప్రాయపడు తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి.. స్థానిక వ్యాపారులు, మార్వాడీ వ్యాపారుల మధ్య సామరస్యాన్ని నెలకొల్పేందుకు ప్రయత్నించాలి. ఇరు వర్గాల వాదనలు విని, సమస్యను పరిష్కరించడానికి ఒక మధ్యేమార్గం కనుగొనాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో.. ఈ ఉద్యమం రాష్ట్రంలో మరింత ఉద్రిక్తతలకు దారితీయవచ్చు. వ్యాపారులు తమ వాణిజ్య కార్యకలాపాలపై దృష్టి సారించేలా.. స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించేలా ఒక పారదర్శకమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

# ఆరోగ్యశ్రీ సేవలు బంద్




**తెలంగాణ:** ఈ నెలాఖరున అనగా ఆగష్టు 31 అర్ధరాత్రి నుండి ప్రైవేట్ ఆసుపత్రుల లో ఆరోగ్రశ్రీ సేవలు నిలిపివేయబోతున్నారని సమాచారం. దీనికి కారణం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడమే. జనవరిలో బకాయిల చెల్లింపు గురించి ప్రభుత్వ ం హామీ ఇచ్చినా.. అది మాత్రం అమల్లో కి రాలేదు. దీని వల్ల ఆస్పత్రులపై ఆర్థికభారం పడుతుందని.. అందుకే సమస్య పరిష్కారం కోసం ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయబోతున్నట్లు ప్రకటించారు. సమాజంలో అతి ఖరీదైంది ఏంటంటే నాణ్యమైన వైద్యం పొందడం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, వసత కొరత కారణంగా చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడానికే మొగ్గు చూపుతారు. అక్కడకు వెళ్లామంటే ఆస్తులు అమ్ముకుని అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి. ఈ సమస్యను పరిష్కరించడం కోసం ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. దీని ద్వారా పేదలు, మధ్య తరగతి ప్రజలకు ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఇక కాంగ్రెస్ సర్కార్ ఆరోగ్రశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచిన సంగతి తెలిసిందే. మరి పేదవారి పాలిట సంజీవనిలా ఉపయోగపడే ఆరోగ్యశ్రీ సేవలు త్వరలోనే నిలిచిపోనున్నాయని సమాచారం. పేదలకు ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం అందించే ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కానున్నాయి. ఈ నెల అనగా ఆగస్టు 31 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోనున్నాయి. ఇందుకు కారణం ఆరోగ్య శ్రీ బకాయిలు పేరుకుపోవడం. ప్రభుత్వం సకాలంలో ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోవడతో.. నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. బకాయిల పెండింగ్ అంశం గురించి గతంలోనే హెచ్చరికలు జారీ చేసినా.. ప్రభుత్వం వాటిని సీరియస్‌గా పట్టించుకోలేదు. దీంతో ఆగస్టు 31 నుంచి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ నెల 31 అర్ధరాత్రి నుంచి ఆరోగ్యశ్రీ సేవలను నిలిచిపోనున్నాయి. ఆరోగ్యశ్రీతో పాటు జర్నలిస్టులు, ఉద్యోగుల హెల్త్ స్కీమ్స్‌కు కూడా ఈ నిలిపివేత వర్తించనుందని తెలుస్తోంది. ఆస్పత్రులపై ఆర్థిక భారం పెరగడం కూడా ఈ నిర్ణయానికి ఒక కారణమని అంటున్నారు. ఈ ఏడాది జనవరిలోనే ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేస్తామని హెచ్చరిం చింది. చర్చల అనంతరం దీన్ని కొనసా గించేందుకు ఆసుపత్రులు ప్రభుత్వానికి కొన్ని విజ్ఞప్తులు చేశాయి. ఆ సమయంలో రూ.1,300-1,400 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అందుకే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు టీఏఎన్‌హెచ్ఏ తెలిపింది. ప్రభుత్వం పెండింగ్ బకాయిలు‌ెల్లించకపోవడంతో.. చిన్న ఆసుప త్రులు మూతపడే పరిస్థితికి వచ్చాయని టీఏఎన్‌హెచ్ఏ అధ్యక్షుడు వడ్డిరాజు రాకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుతవం 4-5 నెలల్లో బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ప్యాకేజీలను కూడా సవరిస్తామని తెలిపింది. కానీ ఆరు నెలలు గడిచినా వీటిని అమలు చేయలేదని తెలిపారు. అందుకే ఈ నిర్ణయం తీసుకోవాలసి వచ్చిందని తెలిపారు.



# చిరంజీవి బర్త్‌డే వేడుకకు మెగా హీరోలందరికీ పిలుపు..

చిరంజీవి 70వ బర్త్ డే సెలబ్రేషన్స్ కోసం మెగా ఫ్యాన్స్ ఘనంగా ఏర్పాట్లు చేశారు. శిల్పకళా వేదికలో గ్రాండ్‌గా ఈవెంట్ ప్లాన్ చేశారు. దీనికి పెద్ద ఎత్తున అభిమానులు హాజరుకానున్నారు. పవన్ కళ్యాణ్ కోసం కష్టపడుతున్న వీర మహిళలకు ఈ వేడుకలో మొమెంటోలు ఇవ్వబోతున్నట్లు అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు చెప్పారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో అత్యధిక సార్లు రక్తదానం చేసిన వారిని సన్మానిస్తామన్నారు. ఈ ఈవెంట్ కు మెగా హీరోలందరినీ ఆహ్వానించినట్లు తెలిపారు.

మెగా అభిమానులకు 'ఆగస్టు 22' పండగ రోజు. ఎందుకంటే అది మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈసారి కూడా గ్రాండ్ గా సెలబ్రేషన్స్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఓవైపు రక్తదానాలు, అన్నదానాలు వంటి సామాజిక కార్యక్రమాలు చేస్తూనే.. మరోవైపు సోషల్ మీడియాలో బాస్ 70వ బర్త్ డే ట్రెండ్ చేయడానికి ప్లాన్ చేసుకున్నారు. ఇంకోవైపు ఫ్యాన్స్ ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేయడానికి చిరు నటిస్తున్న సినిమాల నుంచి అప్డేట్స్ రాబోతున్నాయి. చిరంజీవి పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన వివరాలను అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు, చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ రవణం స్వామి నాయుడు ఓ యూట్యూబ్ ఛానల్ తో పంచుకున్నారు.

చిరంజీవి బర్త్ డే సందర్భంగా ప్రతీ సంవత్సరం అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో సెలబ్రేషన్స్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా చాలా ఘనంగా పుట్టినరోజు వేడుక నిర్వహించబోతున్నట్లు స్వామి నాయుడు తెలిపారు. ఈరోజు సాయంత్రం హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో గ్రాండ్ గా ఈవెంట్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. వశిష్ఠ దర్శకత్వంలో చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ వీడియోని అదే వేదిక మీద సాయంత్రం గం.6.06 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు చెప్పారు. చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబోలో తెరకెక్కనున్న సినిమాకి సంబంధించిన అనౌన్స్ మెంట్ పోస్టర్ కోసం ఎదురు చూస్తున్నామని అన్నారు.

# కొరటాల శివతో సినిమాపై క్లారిటీ..



తండేల్ సినిమాతో అక్కినేని నాగచైతన్య సూపర్ హిట్ కొట్టారు. చాన్నాళ్ల తర్వాత చైతూకి ఓ మంచి హిట్ పడింది. ఇక ఈ సినిమా తర్వాత చై ఎలాంటి ప్రాజెక్ట్ ఎంచుకుంటారా అని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇలాంటి వేళ కొరటాల శివతో చైతూ సినిమా చేస్తున్నారంటూ టాక్ వచ్చింది. అందులోనూ కెరీర్‌లో మైలురాయి అయిన 25వ సినిమా కావడంతో కొరటాలతో చేస్తున్నారంటూ ప్రచారం జరిగింది. ఈ వార్తలపై తాజాగా చై టీమ్ రియాక్ట్ అయింది.

"నాగచైతన్య- కొరటాల శివ కాంబోలో సినిమా వస్తుందని పెద్ద ఎత్తున రూమర్లు వస్తున్నాయి. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ప్రస్తుతం అలాంటి ప్రాజెక్ట్ ఏం మేము అనుకోలేదు. భవిష్యత్తులో చేస్తే ఖచ్చితంగా అధికారికంగా ప్రకటిస్తాం. మీ మద్దతు ఎప్పటిలానే కొనసాగుతుందని ఆశిస్తున్నాం" అంటూ చైతూ టీమ్ పేర్కొంది.

చైతూ కెరీర్ విషయానికొస్తే 2021లో వచ్చిన లవ్‌స్టోరీ తర్వాత చైకి సరైన హిట్ పడలేదు. దీంతో తండేల్ కోసం చాలానే కష్టపడ్డారు. ముఖ్యంగా ఈ సినిమాకి దేవిశ్రీ ప్రసాద్ ఇచ్చిన మ్యూజిక్ విజయంలో కీలకపాత్ర పోషించింది. డీఎస్పీ బీజీఎమ్, సాయి పల్లవి డ్యాన్స్, యాక్టింగ్, చైతూ పెర్ఫామెన్స్‌తో సినిమా విజయం సాధించింది.

మరోవైపు దేవర సినిమాతో విజయం అందుకున్న కొరటాల ఈ మూవీ పార్ట్ 2 కోసం ఎదురుచూస్తున్నారు. అయితే జూ ఎన్టీఆర్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో ఈ సినిమా సెట్స్ మీదకి వెళ్లలేదు. మొన్నటి వరకూ వార్ 2 సహా ప్రశాంత్ నీల్ చిత్రంతో ఫుల్ బిజీగా ఉన్నారు తారక్. ఇప్పుడు వార్ 2 రిలీజ్ అయిపోవడంతో ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ పూర్తి చేసే పనిలో పడ్డారు. ఇది పూర్తి కాగానే కొరటాలతో దేవర 2 కోసం తారక్ పని చేసే అవకాశం ఉంది.

కానీ దీనికి ఇంకా సమయం ఉండటంతో ఈలోపు కొరటాల మరేదైనా ప్రాజెక్ట్ చేస్తారో లేక వెయిట్ చేస్తారో చూడాలి. కానీ సోషల్ మీడియాలో మాత్రం దేవర పార్ట్ 2 ఇక ఉండదంటూ పెద్ద ఎత్తున ట్రోల్స్, పోస్టులు కనిపిస్తున్నాయి. కానీ ఇవన్నీ రూమర్స్ మాత్రమే పార్ట్ 2 ఖచ్చితంగా ఉంటుందని మూవీ టీమ్ చాలా సార్లు చెప్పింది. ఒకవేళ దేవర సినిమా అటు ఇటు అయి ఉంటే కొరటాల కెరీర్ తలకిందులయ్యేది. ఎందుకంటే చిరంజీవి-రామ్ చరణ్‌తో కలిసి కొరటాల తెరకెక్కించిన ఆచార్య చిత్రం డిజాస్టర్ అయింది. దీంతో దేవర హిట్ కావాలని చాలా కసిగా పని చేశారు కొరటాల.

# అలా పేరు తెచ్చుకోవాలని కోరుకోలేదు

మలయాళ అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ కుమార్తె విస్మయ 'తుడక్కమ్' చిత్రంతో వెండితెరకు పరిచయం కాబోతున్న విషయం తెలిసిందే. ఆమె అరంగేట్రం గురించి మోహన్‌లాల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. సినీ పరిశ్రమలో రాణించాలంటే కుటుంబ నేపథ్యం ఒక్కటే ఉంటే సరిపోదని ప్రతిభ కూడా ముఖ్యమన్నారు.

ఇప్పటికే మోహన్‌లాల్ కుమారుడు ప్రణవ్ 2018లోనే సినీరంగంలోకి ప్రవేశించారు. ఇప్పుడు ఈ అగ్రనటుడి కుమార్తె విస్మయ 'తుడక్కమ్'తో ప్రేక్షకులను పలకరించనున్నారు. పిల్లలు ఇండస్ట్రీలోకి రావడం గురించి మోహన్‌లాల్ మాట్లాడారు. "విస్మయకు నటనపై ఆసక్తి ఉందని ఎప్పుడో చెప్పింది. కానీ, నా పిల్లలు కాబట్టి గొప్పవారు కావాలని నేనెప్పుడూ అనుకోలేదు. వారి ప్రతిభతో గుర్తింపు తెచ్చుకుంటే అది వారి భవిష్యత్తుకే మంచిది. వాళ్లు ఇండస్ట్రీకి వస్తామన్నప్పుడు కూడా ఇదే మాట చెప్పాను" అని తెలిపారు.



ఇక అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్ ఎన్నిక కావడంపై మోహన్‌లాల్ హర్షం వ్యక్తం చేశారు. 'అమ్మ'కు ఎప్పుడూ తాను సహాయసహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ అసోసియేషన్‌లో 560 మంది సభ్యులు ఉన్నారని కొత్తవాళ్లు రావాలని ఆయన పేర్కొన్నారు. దీనికి ఎవరు అధ్యక్షులుగా ఉన్నా వాళ్లకు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

# ధీన స్థితిలో టాలీవుడ్ కమెడియన్



సినీ ఇండస్ట్రీ అనేది ఒక రంగుల ప్రపంచం. ఇక్కడ గ్లామర్, సక్సెస్ మాత్రమే కాదు.. దాని వెనుక ఎన్నో అంతులేని కష్టాలు, విషాదాలు కూడా దాగి ఉంటాయి. ఎవరి కెరీర్ ఎలా ఉంటుందో.. ఎవరి లైఫ్ ఎప్పుడు ఎలా మారుతుందో చెప్పలేం. కోట్లు సంపాదించే నటీనటులు ఉన్నట్లే, ఆర్థికంగా చితికిపోయిన యాక్టర్స్ కూడా ఉంటారు. ప్రేక్షకులను తమ నటనతో అలరించిన ఎంతోమంది నటీనటులు కెరీర్ చివరి దశలో ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడటం మనం చూశాం. ఇప్పుడు టాలీవుడ్ కమెడియన్ రామచంద్ర పరిస్థితి కూడా అలానే ఉంది.

కమెడియన్ రామచంద్ర ఎన్నో తెలుగు సినిమాల్లో తన కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించారు. ఆయన పేరు చెబితే పెద్దగా గుర్తు పట్టకపోవచ్చు కానీ, నటించిన సినిమాల పేర్లు చెబితే మాత్రం ఇట్టే గుర్తు పట్టేస్తారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా లాంచ్ అయిన 'నిన్ను చూడాలని' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమయ్యాడు రామచంద్ర. 'ఆనందం', 'సొంతం', 'వెంకీ', 'కింగ్', 'దుబాయ్ శీను', 'లౌక్యం' వంటి సినిమాలలో హీరో ఫ్రెండ్ పాత్రల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. దాదాపు 100 సినిమాలలో నటించిన ఈ నటుడు.. తన కామెడీ టైమింగ్ తో వినోదాన్ని పంచారు. అయితే ఇప్పుడు ఆయన జీవితం ఒక విషాద మలుపు తిరిగింది. ఒకప్పుడు అందరినీ నవ్వించిన ఈ కమెడియన్, ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నారు.

రామచంద్రకు ఇటీవల పెరలాసిస్ రావడంతో ఆయన ఎడమ కాలు చెయ్యి పడిపోయాయి. నడవలేని స్థితిలో మంచానికే పరిమితం అయ్యారు. పక్షవాతం వచ్చి బ్రెయిన్ లో రక్తం గడ్డ కట్టింది. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్ తో తన ఆరోగ్య పరిస్థితి గురించి రామచంద్ర చెప్పుకున్నారు.తన తల్లిదండ్రులు ఎప్పుడో చనిపోయారని, ప్రస్తుతం తమ్ముడు తన బాగోగులు చూసుకుంటున్నాడని తెలిపారు. తోటి ఆర్టిస్టులకు తన ఆరోగ్య పరిస్థితిని వివరించానని, వాళ్ల ద్వారా ఈ విషయం ఇండస్ట్రీలోని ప్రముఖులకు చేరుతుందని ఆశిస్తున్నాని అన్నారు. ఇప్పటికైతే పరిశ్రమ నుంచి ఎవరూ తనకు ఫోన్ చేసి ఎలా ఉందని అడిగిన వారు లేరన్నారు. రెండు నెలలపాటు పూర్తిగా బెడ్ రెస్ట్ తీసుకోమని డాక్టర్లు చెప్పినట్లుగా రామచంద్ర తెలిపారు. డైలీ ఫిజియో థెరపీ చేపించుకోవాలని, ట్రీట్మెంట్ కి ఇప్పటికే చాలా ఖర్చయిందని చెప్పారు. తన పరిస్థితి తెలుసుకొని ఇండస్ట్రీ నుంచి ఎవరైనా ఆర్థిక సాయం చేస్తారని ఆశిస్తున్నానని, ఎవరికి తోచినంత వాళ్లు ఇచ్చినా తన వైద్యానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఇటీవల హాస్పిటల్ లో రూ.80 వేలు అయిందని, మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ లో ఉండటం వల్ల మ్యాగ్జిమమ్ అమౌంట్ కవర్ అయిందని చెప్పారు. కమెడియన్ రామచంద్ర ఆరోగ్య పరిస్థితి గురించి తెలిసిన సినీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన చికిత్స కోసం, వైద్య ఖర్చులకు ఇండస్ట్రీ నుంచి ఎవరైనా ముందుకొచ్చి సహాయం చేయాలని కోరుకుంటున్నారు.

# ట్రైలర్ నచ్చకపోతే ఏ సినిమా చూడను

ఈరోజుల్లో ఆడియన్స్ చాలా సెలెక్టివ్ గా థియేటర్లకు వచ్చి సినిమాలు చూస్తున్నారు. టీజర్, ట్రైలర్, సాంగ్స్.. ఇలా ప్రమోషనల్ కంటెంట్ నచ్చితేనే సినిమా హాళ్లకు వస్తున్నారు. టాక్ బాగుంటే సక్సెస్ చేస్తున్నారు.. లేదంటే డిజాస్టర్ గా డిక్లేర్ చేస్తున్నారు. అయితే సాధారణ ప్రేక్షకులే కాదు, ఇండస్ట్రీ జనాలు సైతం ట్రైలర్ నచ్చితేనే థియేటర్లలకు వెళ్లి సినిమా చూసే పరిస్థితి ఉంది. టాలీవుడ్ హీరో నారా రోహిత్ కూడా తనకు ట్రైలర్ నచ్చకపోతే సినిమా చూడనని చెబుతున్నారు. 'కూలీ', 'వార్ 2' సినిమాలపై రోహిత్ ఏమన్నారంటే...

ఈరోజుల్లో జనాలను థియేటర్లకు రప్పించడమే ఫిలిం మేకర్స్ కు అసలైన పరీక్షగా మారింది. ఓటీటీలకు అలవాటు పడిపోయిన ఆడియన్స్.. ప్రమోషనల్ కంటెంట్ ఎగ్జైటింగ్ గా అనిపిస్తే తప్ప, బిగ్ స్క్రీన్ మీద సినిమా చూడటానికి ఇంట్రెస్ట్ చూపించడం లేదు. ట్రైలర్, టీజర్ నచ్చితేనో.. మూవీ చాలా బాగుందని టాక్ వస్తేనో తప్పితే, సినిమా హాళ్ల వైపు చూడటం




లేదు. అయితే సాధారణ ప్రేక్షకులే కాదు, సినీ జనాలు కూడా ఇలానే ఆలోచిస్తున్నారు. ట్రైలర్ నచ్చితేనే థియేటర్ కి వెళ్లి సినిమా చూస్తామని చెబుతున్నారు.

టాలీవుడ్ హీరో నారా రోహిత్ దాదాపు ఏడాదిన్నర గ్యాప్ తర్వాత 'సుందరకాండ' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అయ్యారు. మూవీ ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తనకు ట్రైలర్ నచ్చితేనే సినిమా చూస్తానని తెలిపారు. సినిమాలు థియేటర్లలో చూడాలా, ఓటీటీలో చూడాలా అనేది పర్సనల్ ఒపీనియన్ అని పేర్కొన్నారు. రీసెంట్ గా రిలీజైన సినిమాలలో తాను 'కూలీ' చూశానని, 'వార్ 2' మూవీ చూడలేదని రోహిత్ చెప్పారు.

"సిచ్యుయేషన్ ను బట్టి సినిమాలు చేసే వ్యక్తిని నేను. ఇంతకముందు అన్ని ఫిల్మ్స్ చూసేవాడిని. కానీ ఈ మధ్య ట్రైలర్ నచ్చకపోతే సినిమాలు చూడటం లేదు. ఎగ్జైటింగ్ మూవీస్ ఉంటే థియేటర్ కి వెళ్లి చూస్తాను. కొన్ని సినిమాలను మాత్రం ఓటీటీలో చూస్తున్నాను. ఆ మూవీ రిలీజైనప్పుడు టైమ్ లేకపోతే ఓటీటీలో చూస్తాను" అని నారా రోహిత్ అన్నారు. "ప్రమోషనల్ కంటెంట్ నచ్చితే మొదటి రోజు ఎంతో ఎగ్జైట్మెంట్ తో సినిమాకి వెళ్తాం.. అదే టీజర్, ట్రైలర్ ఎగ్జైటింగ్ గా లేకపోతే వేరే ఇతర పనుల మీద ఎక్కువ ఫోకస్ పెడతాం. నచ్చితే మాత్రం అన్ని పనులను పక్కన పెట్టి సినిమాకి వెళ్తాం" అని చెప్పారు.

ఇటీవల రజనీకాంత్ నటించిన 'కూలీ' సినిమాని తన ఫ్రెండ్స్ తో కలిసి చూశానని నారా రోహిత్ తెలిపారు. సినిమా ఓకే అని, చాలా వరకూ ఎంజాయ్ చేశానన్నారు. ఓవరాల్ గా మూవీ ఓకే అని అభిప్రాయపడ్డారు. అయితే అదే రోజున రిలీజైన జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'వార్ 2' మూవీ చూడలేదని చెప్పారు. ఫ్రెండ్స్ అందరూ కూలీకి వెళ్దామని అన్నారని, అందుకే ఆ సినిమా చూశామని తెలిపారు. బహుశా 'సుందరకాండ' విడుదలైన తర్వాత ఎప్పుడైనా 'వార్ 2' చూస్తానేమోనని రోహిత్ అన్నారు.

# యూట్యూబ్‌లో పెడతాడేమో అనుకున్నా..



బాలీవుడ్ అగ్ర కథానాయకుడు షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆర్యన్ దర్శకత్వం వహించిన 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' వెబ్‌సిరీస్ ట్రైలర్ తాజాగా విడుదలై ఆకట్టుకుంటోంది. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో షారుక్ మాట్లాడుతూ తన కుమారుడిపై సరదా కామెంట్స్ చేశారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఆర్యన్ 4 ఏళ్లు కష్టపడ్డాడు. కొత్తగా ప్రయత్నించాలనుందని చెప్పినప్పుడు మన్నత్ (షారుక్‌ఖాన్ ఇల్లు) సీసీ టీవీ ఫుటేజ్ తీసుకెళ్లి యూట్యూబ్‌లో పెడతాడేమో అని భయపడ్డాను. ఇది పూర్తయిన తర్వాత చూసి ఆశ్చర్యపోయాను.నిజాయితీగా చెప్పాలంటే ఆర్యన్ ప్రతిభ చూశాక చాలా సంతోషంగా ఉన్నా. ఈ సిరీస్‌లోని వారంతా వారి పాత్రలకు ప్రాణం పోశారు. ఆడియన్స్ కచ్చితంగా థ్రిల్లింగ్‌గా ఫీలవుతారు. ముంబయితో మాకు ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. ఇప్పుడు ఇక్కడే ఆర్యన్ కూడా తొలి అడుగువేయడం ఆనందంగా ఉంది. నాపై చూపిన ప్రేమాభిమానాలే అతడిపై కూడా చూపిస్తారని ఆశిస్తున్నాను" అని చెప్పారు.

ఇక ఈ సిరీస్ గురించి ఆర్యన్ మాట్లాడుతూ.. తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఇప్పటివరకూ తెలియని కథతో ప్రేక్షకులను పలకరించనున్నట్లు తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా సెప్టెంబర్ 18 నుంచి ఇది అందుబాటులోకి రానుంది. లక్ష్య, సహేర్, బాబీదేవోల్ కీలక పాత్రలు పోషించారు. హిందీ చిత్రసీమ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సిరీస్‌ను రెడ్‌చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది.

# అందుకే తగ్గించాను



నటిగానే కాకుండా నిర్మాతగానూ సరికొత్త కథలను ప్రేక్షకులకు అందిస్తూ అగ్ర కథానాయిక సమంత ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రముఖ మ్యాగజైన్ 'గ్రాజియా ఇండియా' లేటెస్ట్ ఎడిషన్ కవర్ పేజీపై మెరిసిన విషయం తెలిసిందే. ఆ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఎన్ని సినిమాలు చేశామనేది కాదని.. ఎంత మంచి చిత్రాలు తీశామనేది ముఖ్యమని సమంత చెప్పారు. 15 సంవత్సరాలుగా ఇండస్ట్రీలో తన ప్రత్యేకతను చాటుకుంటోన్న ఆమె ప్రస్తుతం సినిమాలతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. "గతంతో పోలిస్తే ఇప్పుడు నాలో ఎంతో మార్పు వచ్చింది. గొప్ప పనులు చేసే స్థాయికి చేరుకున్నాను. ఫిట్‌నెస్, సినిమాలు రెండిటిపైనా దృష్టిపెట్టాను. మంచి సినిమాలు, సిరీస్‌లలో భాగమయ్యాను. అవన్నీ కేవలం ప్యాషన్ కోసమో, గుర్తింపు కోసమో చేసేవి కావు. అన్నీ నా మనసుకు దగ్గరగా ఉన్న కథలే""తక్కువ ప్రాజెక్ట్‌లు చేయాలని నిర్ణయించుకున్నా. శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నా. ఇకపై ఒకేసారి ఐదు సినిమాలు చేయను. నా శరీరం చెప్పేది వినాలని తెలుసుకున్నా. అందుకే పనిని తగ్గించుకున్నా. కానీ, తక్కువ చేసినప్పటికీ ప్రేక్షకుల మనసుకు నచ్చే వాటితోనే పలకరిస్తాను. ప్రాజెక్ట్‌ల సంఖ్య తగ్గింది.. కానీ, వాటి నాణ్యత కచ్చితంగా పెరుగుతుంది" అని చెప్పారు. ఇక సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సమంత అందులో వచ్చే ప్రశంసలతో పాటు విమర్శలను కూడా స్వీకరించగలగాలని తెలిపారు. "నేను సామాజిక మాధ్యమాల్లో సాధ్యమైనంత వరకు వాస్తవంగా ఉండడానికి ప్రయత్నిస్తాను. కామెంట్స్‌లో వచ్చే ప్రశంసలకు ఎలా ఆనందిస్తామో.. ట్రోలింగ్, నెగెటివ్ కామెంట్స్‌ను కూడా అంతే హుందాగా స్వీకరించగలగాలి. మీరు దాన్ని కంట్రోల్ చేయగలగాలి కానీ, అది మీ జీవితాన్ని పూర్తిగా నియంత్రించకూడదు" అని తెలిపారు. ప్రస్తుతం సమంత 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్'లో నటిస్తున్నారు. దర్శకద్వయం రాజ్, డీకే దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్, సమంతతో పాటు అలీ ఫజల్ కీలకపాత్రలో నటిస్తున్నారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,